ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
మంగళవారం 30 జనవరి 2024

# హెడ్మాస్టర్‌కు దేహశుద్ధి!

- చిన్నారులతో అసభ్యప్రవర్తన
- తల్లిదండ్రుల ఆందోళన.. రాస్తారోకో
- హెచ్‌ఎం అరెస్ట్.. పోక్సో కేసు నమోదు
- సస్పెండ్ చేసిన డీఈవో

అత్తిలి, జనవరి 29 : ఆయన వయసు 60 ఏళ్లు. 35 ఏళ్లకుపైగా పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయుడు. మరో రెండేళ్లలో రిటైర్ కానున్నారు. ఈలోగా ఆయన బుద్ధి పెడదారి పట్టింది. అభం శుభం తెలియని విద్యార్థినులకు విద్యా బుద్ధులు నేర్పాల్సిన ఆయన వారిపై అసభ్యకరంగా ప్రవర్తించి పైశాచిక ఆనందం పొందిన ఈ ఘటన పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండలం బల్లిపాడులోని ఓ ప్రాథమిక పాఠశాలలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ప్రధానోపాధ్యాయుడు మోపిదేవి శ్రీనివాస్ నెహ్రూ కొంత కాలంగా 4, 5 తరగతులు చదువుతున్న తొమ్మిది మంది విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెబితే చంపుతానని బెదిరించడంతో చిన్నారులు మిన్నకుండి పోయారు. అతని చేష్టలకు భయపడిన ఓ విద్యార్థిని విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆగ్రహావేశాలకు గురైన స్థానికులు, మిగిలిన విద్యార్థినుల తల్లిదండ్రులు సోమవారం పాఠశాలను ముట్టడించి ప్రధానోపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. ఈలోగా పలువురు విద్యాశాఖ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎంఈవో రమేష్ పాఠశాలకు వచ్చి విచారణ చేపట్టారు. శ్రీనివాస్ మాస్టారు తమ పట్ల చాలా అసభ్యంగా ప్రవర్తించాడని ఒకరి తర్వాత మరొకరు చెప్పడంతో అంతా అవాక్కయ్యారు. ఆ ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ తల్లిదండ్రులు అత్తిలి పోలీస్ స్టేషన్ ఎదుట రాస్తారోకో చేశారు. సీఐ జీవీవీ నాగేశ్వరరావు వచ్చి కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పడంతో రాస్తారోకో విరమించారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించారనే అభియోగంపై సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు పి.శ్రీనివాస నెహ్రూను సస్పెండ్ చేసినట్లు డీఈవో ఆర్.వెంకటరమణ తెలిపారు. ఆయనపై అత్తిలి పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని ఎంఈవో రమేశ్‌ను ఆదేశించినట్లు డీఈవో పేర్కొన్నారు.

## విజిలెన్స్ సబ్ ఇన్‌స్పెక్టర్‌కు వారెంట్

నూజివీడు టౌన్, జనవరి 29 : విజిలెన్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రంజిత్‌కుమార్‌కు నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి సోమవారం బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. విచారణ చివరి దశలో ఉన్న పలు క్రిమినల్ కేసుల్లో సాక్ష్యం ఇవ్వడానికి కోర్టుకు హాజరు కానందుకు ఏలూరు ఎన్ ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రంజిత్‌కుమార్‌కు ప్రత్యేక న్యాయమూర్తి వారెంట్ జారీ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. గతంలో నూజివీడు పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్‌లలో ఎస్ఐగా పనిచేసిన కాలంలో పలు క్రిమినల్ కేసుల్లో దర్యాప్తు జరిపి ఛార్జ్‌షీట్‌లు దాఖలు చేశారు. ఆ కేసుల్లో ప్రస్తుతం విచారణ జరుగుతుండగా కోర్టుకు హాజరుకాకపోవడంతో న్యాయమూర్తి సమన్లు పంపారు. కోర్టు పంపిన సమన్లు తీసుకోకుండా, కోర్టుకు హాజరుకాకపోవడానికి కనీసం సమాధానం ఇవ్వకపోవడంతో ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు.

## ఇద్దరు బీఎల్‌వోల సస్పెన్షన్

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 29: తాడేపల్లిగూడెం పట్టణం, మండలంలోని ఓటర్ల జాబితాలో తప్పులు రావడానికి కారణమైన ఇద్దరు బీఎల్‌వోలను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ప్రశాంతి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. తాడేపల్లిగూడెం 20వ వార్డు బీఎల్‌వో, వీఆర్‌వో జి.నిర్మల, పెదతాడేపల్లి సచివాలయం-2లో బీఎల్‌వో, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వి.అనూషలను ఇటీవల విడుదల చేసిన ఓటర్ల జాబితాలో తప్పులు రావడంలో బాధ్యులను చేస్తూ పూర్తి విచారణకు ఆదేశించారు.

## సైబర్ నేరగాళ్ల వలలో పడకండి : ఎస్పీ



ఏలూరు క్రైం, జనవరి 29 : సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నా రు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యా లయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి 50 మంది ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల వద్ద నుంచి వచ్చే వాట్సప్ మెస్సేజ్‌లకు స్పందించవద్దని, లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. ఓటీపీ నెంబర్లను ఎవరికి చెప్పకూడదన్నారు. స్పందనలో అందిన ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత స్టేషన్ అధికారులకు ఫోన్ చేసి వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు.

# పన్నుల మాఫీకి స్కెచ్




## ఆసుపత్రి యాజమాన్యంతో ఓ అధికారి రహస్య ఒప్పందం


- ట్రస్ట్ ఆసుపత్రి బకాయి రూ.3.2 కోట్లు
- ఫీజుల వసూళ్లు.. ఆరోగ్యశ్రీ ప్యాకేజీలు అమలు
- గడచిన ప్రభుత్వం పన్ను చెల్లించాలంటూ నోటీసులు
- అదే ఇప్పుడు మాఫీ చేసేందుకు అధికారి యత్నం !

(భీమవరం-ఆంధ్రజ్యోతి):

జిల్లా వాణిజ్య కేంద్రంగా పేరు పొందిన పట్టణంలో ఆస్తి పన్ను మాఫీకి ఓ అధికారి ప్రణాళిక రచించారు. ట్రస్ట్ పేరుతో రిజిస్ట్రేషన్ అయిన ప్రైవేటు ఆసుపత్రి సంబంధిత మున్సిపాలిటీకి రూ.3.2 కోట్లు బకాయిపడింది. ట్రస్ట్ ఆసుపత్రిలో రోగుల నుంచి ఫీజులు వసూలు చేస్తారు. ప్రభుత్వం అమలు చేస్తు న్న ఆరోగ్యశ్రీ సేవల్లోనూ ప్యాకేజీలు తీసుకుంటారు. కరోనా సమయంలోనూ సదరు ట్రస్ట్ ఆసుపత్రిలో ప్యాకేజీలు తీసుకున్నారు. కొన్నేళ్ల నుంచి మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఆస్తి పన్నుపై ఆసుపత్రి యాజమాన్యం స్పందించడం లేదు. గత పాలకవర్గం నోటీసులు జారీచేసింది. ఆస్తి పన్ను చెల్లించాలని ఆదేశించింది. బకాయి విషయమై కౌన్సిల్ సమావేశంలోనూ చర్చసాగింది. ట్రస్టు ఆసుపత్రి పన్ను చెల్లించాల్సిందేనంటూ కౌన్సిల్ తీర్మానించింది. అప్పటి నుంచి ఈ విషయం నలుగుతోంది. పన్ను చెల్లింపు విషయమై న్యాయస్థానంలో కేసు నడుస్తోంది. ఈ క్రమంలో పన్ను రద్దుకు ఓ అధికారి కొన్నాళ్ల నుంచి ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆసుపత్రి వర్గాలతో సంప్రదింపులు జరిపారు. ప్రస్తుతం పాలకవర్గం లేదు. ఇన్‌ఛార్జ్ పాలనలో మున్సిపాలిటీ నడుస్తోంది. మునిసిపల్ ఇన్‌ఛార్జ్ ఆమోదముద్ర వేస్తే పన్ను రద్దు అవుతుంది. ట్రస్ట్ ఆసుపత్రికి రూ.3.2 కోట్లు లబ్ధి చేకూరుతుంది. ట్రస్ట్ పేరుతో వ్యాపారం చేస్తున్న ఆసుపత్రికి పన్ను మినహాయింపు ఇవ్వకూడదంటూ గత పాలకవర్గం తేల్చింది. ఇప్పుడు అధికారుల కనుసన్నల్లో పాలన కొనసాగుతోంది. దీంతో ఓ అధికారి పన్ను రద్దుకు పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది. అదే జరిగితే మున్సిపాలిటీకి భారీ మొత్తంలో నష్టం వాటిల్లనుంది.

### అధికారి తీరుపై..

మున్సిపాలిటీలో అధికారి వ్యవహరిస్తున్న తీరుపై అధికార పార్టీ నేతలు పెదవి విరుస్తున్నారు. నియోజక వర్గానికి చెందిన ఒకే నేతకు సదరు అధికారి తలూపుతుంటారు. మిగిలిన నాయకులంటే పెద్దగా మన్నన ఇవ్వడం లేదు. మరోవైపు మున్సిపాలిటీలో అవినీతి పెరిగిందంటూ అంతా గగ్గోలు పెడుతున్నారు. అధికార పార్టీ నాయకులే సదరు అధికారి అక్రమాలపై బహిరంగంగా విమర్శలు గుప్పించారు. పట్టణంలో రహదారుల విస్తరణ లోనూ అవినీతి సాగిందంటూ అధికార పార్టీ శ్రేణులే ఆరోపిస్తున్నాయి. ఇటీవల పట్టణం లోని ఆరు వార్డుల్లో రోడ్లపై ర్యాంపులను తొలగించారు. దీనివల్ల రహదారుల విస్తరణ సాధ్యపడింది. ర్యాంపుల తొలగింపు కోసం మున్సిపాలిటీ వాహనాలు వినియోగించారు. దీనికోసం ఒక్కో వార్డులో దాదాపు రూ.6 లక్షల మేర బిల్లులు చెల్లించినట్టు సమాచారం. మున్సిపాలిటీ వాహనాలను వినియోగించి అంత పెద్ద మొత్తంలో సొమ్ములు ఎందుకు చెల్లిస్తున్నారంటూ వైసీపీ శ్రేణులే నిలదీస్తున్నాయి. ర్యాంపుల తొలగింపు విషయంలో మాత్రం అధికారుల చర్యలతో పట్టణంలో కాస్త మంచి స్పందనే వచ్చింది. వాహనాల రాకపోకలకు సౌకర్యం కలిగిందన్న భావన వ్యక్తమైంది. ఇతర వార్డుల్లోనూ ర్యాంపులను తొలగించేందుకు ప్రణాళిక రచించారు. ఆక్రమంలో పెద్ద మొత్తంలో బిల్లులు చెల్లిస్తున్నా న్న అపవాదును అధికారులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు పట్టణంలో సుందరీకరణ పేరుతోనూ అధిక మొత్తంలో బిల్లులు చెల్లిస్తున్నారు. అధికార పార్టీ నేత వసూళ్లు కొంతయితే అ పేరుతో అధికారులు దండుకుంటున్నారు. బిల్లులు కూడా అధిక మొత్తంలో చెల్లిస్తున్నారన్న అపవాదును ఎదుర్కొంటున్నారు. తాజాగా పన్ను రద్దు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారంటూ అంతా కోడై కూస్తున్నారు.




# అహా..మాకేంటి?

- దాడుల సమయంలో పట్టుకునేది దోసెడు .. కేసుల్లో చూపించేది గుప్పెడు
- ఇదీ ఏలూరు జిల్లాలో కొంత మంది పోలీసుల తీరు ..
- కాసులు కురిపిస్తున్న పేకాట, అక్రమ మద్యం, కోడి పందేలు



ఏలూరు క్రైం, జనవరి 29 : జిల్లాలో అక్రమ మద్యం, పేకాటలు, కోడిపందేలు కొంత మంది అవినీతి పోలీసులకు కాసులు కురిపిస్తున్నాయి. గతంలో పోలీసులు దాడి చేస్తే ఆ దాడిలో ఏమి లభిస్తే వాటిని కేసులో సీజ్ చేసి చూపించే వారు. ప్రస్తుతం జిల్లా పోలీస్ యంత్రాంగంలోని కొంతమంది తమ చేతి వాటాన్ని ప్రదర్శిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో కొంతమంది పోలీసు అధికారులు గుట్టుచప్పుడు కాకుండా పేకాటలకు అనుమతులు ఇచ్చేస్తున్నట్టు తెలుస్తోంది. ఎస్ఈబీ దాడి చేసినప్పుడు తాము పోలీసులకు మామూళ్లు ఇచ్చామంటూ చెబుతుండడంతో గొంతులో వెలక్కాయపడ్డట్టు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇటీవల సంక్రాంతి సమయంలో వేలేరుపాడులో ఒక వీధిలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి అక్కడ లభించిన సొమ్మును మొత్తం చూపించకుండా తక్కువే చూపించడంతో ఆ కేసులో ఉన్న వారు జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చి రాత పూర్వకంగా ఫిర్యాదు చేసి వెళ్లారు.



- జిల్లాలో కొన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో యథేచ్ఛగా పేకాటలు జరుగుతూనే ఉన్నాయి. అక్రమ మద్యం విక్రయాలు సాగుతున్నాయి. కొన్ని పోలీస్ స్టేషన్లలో రైటర్లే ఈ వ్యవహారాలు చూస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కొన్నేళ్లుగా అక్కడే పాతుకుపోయిన రైటర్లు వేరే ప్రాంతాలకు బదిలీ అయినా మళ్లీ డిప్యుటేషన్‌పై అక్కడకే వచ్చి రైటర్లుగా అవతారం ఎత్తివేస్తున్నారు. వారే చక్రాలు తిప్పేస్తున్నారు. ముఖ్యంగా అక్రమ మద్యం, మద్యం విక్రయాలు, బెల్టు షాపుల నిర్వాహకులు పట్టుబడిన సమయంలో వేలాది రూపాయలు స్టేషన్‌లో ఈ రైటర్లు, ఎస్‌హెచ్‌వోలు గుంజేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.
- ఏడేళ్లలోపు జైలు శిక్ష పడే కేసుల్లో నిందితులకు స్టేషన్‌లో 41(ఏ) నోటీసుతో పాటు బెయిల్ ఇచ్చి పంపివేయాలని సుప్రీంకోర్టు నిబంధనలు ఉన్నాయి. అయితే ఈ నిబంధనను అడ్డు పెట్టుకుని కొంతమంది పోలీసు అధికారులు, రైటర్లు కాసులు దండుకుంటున్నారు. ఒక కేసులో పట్టుబడిన వ్యక్తికి 24 గంటలల్లోపు అతన్ని అరెస్టు చూపించి అతనికి స్టేషన్ బెయిల్ ఇవ్వాలి. ఇటీవల ఎక్సైజ్ కేసులో నోటీసు ఇవ్వకుండా తాత్సారం చేస్తూ 12 రోజుల పాటు స్టేషన్‌కు తిప్పిస్తూ లంచంకోసం డిమాండ్ చేయడంతో చివరకు బాధితుడు విసిగిపోయి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈక్రమం లో ఏలూరు రూరల్ రైటర్ డీవీ రమణ రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు చిక్కాడు. అతనితో పాటు 1000 రూపాయలు ఫోన్‌పే చేయించుకున్న ఏఎస్ఐ కె.వెంకన్నబాబు ఏసీబీ అధికారులకు చిక్కారు. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌పై ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారులకు అవినీతి ఆరోపణలతో ఫిర్యాదులు వెళ్లాయి.
- జిల్లాలో చాలా పోలీస్ స్టేషన్లలో పట్టుబడుతున్న పేకాట రాయుళ్ల నుంచి అధిక మొత్తంలో సొమ్ము పట్టుకుంటున్నప్పటికీ తక్కువ సొమ్ము చూపిస్తున్నారు. ఎక్కువ సొమ్మును కేసులో చూపిస్తే శిక్ష ఎక్కువ పడుతుందని పోలీసులు ఈ విధంగా బెదిరిస్తున్నారని కొంతమంది చెబుతున్నారు. మద్యం కలిగి ఉన్న వ్యక్తులను అరెస్టు చేసిన కేసుల్లో అరెస్టు అయిన సమయంలో సొమ్ములను కేసులో చూపించకుండా తమ చేతివాటాన్ని కొంతమంది ఎస్‌హెచ్‌వోలు, స్టేషన్ రైటర్లు ప్రదర్శిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణం ప్రక్షాళన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# వలంటీర్లకు జీతం కట్ !

జంగారెడ్డిగూడెం, జనవరి 29 : వైసీపీ ప్రభుత్వంలో అన్నీ తామై వ్యవహరిస్తున్న వలంటీర్లకు షాక్ తగిలింది. వారికి ఇచ్చే జీతంలో కోతలు విధించడంతో పలువురు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి బయటకు చెప్పలేక.. మింగలేక కుమిలిపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీ పరిధిలో పది సచివాలయాల పరిధిలో 219 మంది వలంటీర్లు ఉన్నారు. గత అక్టోబరులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే సరిగ్గా చేయలేదని వలంటీర్లకు జీతానికి సంబంధించి బిల్లు పెట్టకపోవడంతో వారికి ఆ నెలలో జీతాలు అందలేదని తెలిసింది. డిసెంబరులో కచ్చితంగా ప్రతి వలంటీరు సచివాలయ అడ్మిన్, ఎడ్యుకేషన్ సెక్రటరీ వద్దకు వెళ్లి వారంలో సోమ, బుధ, శుక్రవారాల్లో థంబ్ అటెండెన్స్ వేయించుకోవాలన్న నిబంధన వచ్చింది. ఆ నెలలో చాలామంది వలంటీర్లు థంబ్‌లు సరిగ్గా వేయలేకపోయారు. దీనికి కారణం వారు సచివాలయాలకు వెళ్లిన సమయంలో అక్కడ వారు లేకపోవడం, సర్వేలు తదితరాల కారణాల వల్ల థంబ్ వేయలేనట్టు సమాచారం. దీంతో డిసెంబరులో వలంటీర్ల జీతానికి కోత పడింది. అటెండెన్స్ ప్రకారం ఇచ్చే రూ.5వేలలో కోతలు పెట్టడంతో సుమారు రూ.1000 నుంచి రూ.2వేలకు పైగానే కోత గురైన వలంటీర్లు చాలామంది ఉన్నట్టు సమాచారం. వలంటీర్లపై ఎంతో నమ్మకం పెట్టుకున్న సీఎం జగన్‌కు చివరకు వలంటీర్ల నుంచి అసంతృప్తి తప్పని పరిస్థితులు ఇక్కడ నెలకొన్నాయి. దీనిపై మునిసిపల్ కమిషనర్ భవాని ప్రసాద్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

# చింతలపూడిపై నేడు రైతు సంఘం నిరసన

నూజివీడు టౌన్, జనవరి 29 : చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని కోరుతూ నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన దీక్ష చేపట్టనున్నట్టు రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రాయల లక్ష్మణరావు తెలిపారు. చింతలపూడి పథకం పనుల నిలుపుదలకు నిరసనగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య, వివిధ రాజకీయ పక్షాల నాయకులు, రైతు సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. నూజివీడు, తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు రెండు లక్షల ఎకరాల మెట్ట ప్రాంతానికి శాశ్వత నీరుతో పాటు 410 గ్రామాల్లో తాగునీటిని అందించే అవకాశం, చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్ -2 ద్వారా సాధ్యమవుతుంది.

**చింతలపూడి :** చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి మెట్ట ప్రాంత రైతులకు శాశ్వత సాగునీటి జలాలు కల్పించాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ డిమాండ్ చేశారు. చింతలపూడి మండలం సమ్మెటవారిగూడెంలో రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయడానికి రైతులు కదలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రావెళ్ళ రాజా, తదితర రైతులు పాల్గొన్నారు.

# 221 అర్జీల స్వీకరణ



ఏలూరు కలెక్టరేట్, జనవరి 29 : అధికారులు అర్జీలను క్షుణంగా పరిశీలించి సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ఆయన డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు, హౌసింగ్ పీడీ కె.రవికుమార్, డ్వామా పీడీ రాము, డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణమూర్తితో కలిసి మొత్తం 221 అర్జీలు స్వీకరించారు. అర్జీల్లో కొన్ని.. తమ వారసత్వ భూమిని ఆక్రమించుకోవాలని తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని దేవులపల్లికి చెందిన కె.అరుణ, తమకు పంచాయతీ లేఅవుట్ వేసి ఇంటిస్థలం ఇచ్చారని, లేఅవుట్‌లో ఉన్న దారిని ఆక్రమించుకున్నారని, ఆక్రమణ తొలగించాలని ద్వారకా తిరుమలకు చెందిన హేమపవన్‌కుమార్, డ్రెయినేజీ అక్రమంగా తవ్వుతున్నారని, తవ్వకాన్ని నిలిపివేసి యథావిధిగా డ్రెయిన్‌ను కొనసాగించాలని కాట్లంపూడికి చెందిన మరియమ్మ, గ్రామంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని నడిపల్లికి చెందిన తిరుపతిరావు ఫిర్యాదు చేశారు.

# మృతులకూ ఓట్లు..!

ముసునూరు, జనవరి 29 : సమగ్ర ఓటరు జాబితాను తయారు చేయడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినా బీఎల్‌వోలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా అనేక తప్పులు దొర్లాయి. గత కొన్నేళ్ల క్రితం గ్రామం వదిలివెళ్లిన వారితో పాటు మృతి చెందిన ఓట్లు నేటికి జాబితాలో ఉండడం గమనార్హం. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి చనిపోయిన వారి ఓట్లు తొలగింపుపై ప్రత్యేకంగా విచారణ చేసి ఆ ఓటర్లను జాబితాలో నుంచి తొలగించామని చెబుతున్నారు. కాని ఇటీవల ఎన్నికల సంఘం విడుదల చేసిన నూతన ఓటరు జాబితాల్లో అనేక తప్పులు చోటుచేసుకున్నాయి. గోగులంపాడుకు చెందిన సుగసాని వెంకటేశ్వరరావు ఏడేళ్ల క్రితం చనిపోయాడు. ఆయన పేరు 85వ పోలింగ్ కేంద్రంలో వరుససంఖ్య 582గా ఉంది. ఇదే పోలింగ్ కేంద్రంలో ఉన్న సుగసాని ధర్మయ్య నాలుగేళ్ల కిందట చనిపోగా పేరు తొలగించకపోవడంతో వరుస సంఖ్య 578గా జాబితాలో ఓటు ఉంది. పాలడుగు ఝాన్సీ నాలుగేళ్ల కిందట చనిపోగా ఇంకా 85వ పోలింగ్‌కేంద్రం జాబితాలో ఆమె పేరు అలాగే ఉంది. 84వ పోలింగ్ కేంద్రంలో చింతలవల్లికి చెందిన పరసా శ్రీమన్నారాయణ ఏడేళ్ల క్రితం గ్రామం వదిలి మరో గ్రామానికి వెళ్లి అక్కడ నివసిస్తూ ఏడాదిన్నర క్రితం మృతి చెందాడు. జాబితాలో వరుస సంఖ్య 783గా ఉన్న అతని పేరును అధికారులు జాబితాలో నుంచి తొలగించలేదు. ఇదే పోలింగ్ కేంద్ర పరిధిలో పల్లెపాం సంజీవరావు నాలుగేళ్ల క్రితం చనిపోగా జాబితాలో 678 వరుస సంఖ్యతో ఓటు ఉంది. రమణక్కపేటలో 52వ పోలింగ్ కేంద్ర జాబితాలో బొందల దేవి అనే మహిళ పేరు తెలుగులో ఉండాల్సి ఉండగా, ఆ పేరు హిందీలో ముద్రించారు. చింతలవల్లి 85వ పోలింగ్ కేంద్రంలో మోరంపూడి రత్నమాణిక్యమ్మ ఏడేళ్ల క్రితం చనిపోగా ఆమెపేరు తొలగించలేదు. ఆదే పోలింగ్ కేంద్రంలో పిల్లి స్వరూప (వరుస సంఖ్య 159) ఫొటో బదులు ఆధార్ కార్డు ముద్రించారు. ముసునూరులో 81వ పోలింగ్ కేంద్రంలో కాశీ నవీన్ కుమార్ (వరుస సంఖ్య 92) ఓటరు పేరు అయితే నవీనూగా నమోదైంది. తండ్రిపేరు శ్రీనివాసాచారి అయితే డ జాడ అని తండ్రి పేరును ముద్రించారు. ఇదే పోలింగ్‌కేంద్రంలో ఓటర్ల ఫొటోలు కంటికి కనిపించని ఆవగింజ సైజులో ఉండగా కొన్ని ఫొటోలు నల్లగా, మసకగా కనిపిస్తున్నాయి. నూతనంగా ఎన్నికల సంఘం విడుదల చేసిన సమగ్ర ఓటరు జాబితాలో ఉన్న తప్పులు తడకలతో ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జాబితాలో ఉన్న తప్పులను సరిచేయాలని కోరుతున్నారు.

**తప్పుల తడకగా గోగులంపాడు ఓటరు జాబితా**



ఓటరు జాబితాలో చనిపోయిన ఓటర్లు

# సర్కార్‌పై సర్పంచ్‌ల సమర శంఖం

- నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా
- దారి మళ్లించిన నిధులు జమ చేయాలంటూ డిమాండ్

ఏలూరు రూరల్, జనవరి 29 : ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రజలు ఓట్లువేసి గెలిపించిన ప్రజాప్రతినిధులన్న కనీస గౌరవం ఇవ్వకపోయినా జగన్ ప్రభుత్వం తనను ఎన్ని విధాలుగా అవమానించినా ఉత్సవ విగ్రహాలుగా మార్చేసినా ఇన్నాళ్లు భరించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తమపైనే పెత్తనం చేస్తున్నా కనీస మర్యాద ఇవ్వకున్నా సహించారు. పంచాయతీ నిధులను రాష్ట్రప్రభుత్వం దారి మళ్లిస్తే, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధుల్లేక ఎన్నుకున్న ప్రజల ముందు తలెత్తుకోలేక తీవ్ర అవమాన భారాన్ని మోశారు. కేంద్రం దృష్టికి తీసుకెళ్లగా కేంద్రం సైతం కంటితుడుపు చర్యలు తీసుకుంది. తమ పోరాట ఫలితంగా కొంతమేర నిధులు సాధించారు. పూర్తిస్థాయిలో ప్రభుత్వం వాడేసుకున్న 14, 15 ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు చెల్లించాలని మరోసారి పార్టీలకతీతంగా జగన్ ప్రభుత్వంపై సమర భేరీ మోగించనున్నారు. దానిలో భాగంగా మంగళవారం నుంచి ఆందోళనకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చారు. సర్పంచ్‌లపై కక్ష కట్టినట్టుగా వైసీపీ ప్రభుత్వం వ్యవహరించింది. గ్రామ సచివాలయాల పేరుతో సమాంతర వ్యవస్థను తీసుకొచ్చి ఉత్సవ విగ్రహాలుగా మార్చివేయడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. గ్రామ సచివాలయాలు పంచాయతీ పరిధిలోనే పని చేస్తాయని మొదట చెప్పి వాటిపై తమకు ఎటువంటి అజమాయిషీ లేకుండా చేయడాన్ని తట్టుకోలేకపోతున్నారు. ప్రభుత్వం ఎటువంటి నిధులు ఇవ్వకపోగా, 14, 15 ఆర్థిక సంఘాల నుంచి వచ్చే నిధులను జగన్ ప్రభుత్వం లాగేసుకుంది. ఇప్పటి వరకు 3వేల కోట్లకు పైగా దారి మళ్లించింది. సర్పంచ్‌లకు తెలియకుండా విద్యుత్‌ఛార్జీల బకాయిలకు మళ్లించింది. పీడీ ఖాతాలో నిధులను విద్యుత్ పంపిణీ సంస్థలకు బదిలీ చేసింది. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి, పంచాయతీరాజ్, కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లినా అక్కడ ఎటువంటి చలనం కనిపించలేదు. పంచాయతీలను ప్రభుత్వం మరింత నిర్వీర్యం చేస్తూనే ఉంది. వీరిపోరాట ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా 14 వేల కోట్లు ఇటీవలే పంచాయతీలకు రాష్ట్రప్రభుత్వం జమ చేసింది. పూర్తిస్థాయిలో నిధులు పంచాయతీలకు జమ చేయాలని వారు డిమాండ్ చేస్తూ ఆందోళనకు సిద్ధమయ్యారు.

### ఆర్థిక సంఘం నిధులు జమ చేయాలి



2022లో రూ.2,010 కోట్లు, 23-24లో రావాల్సిన రూ.2,031 కోట్లు కేంద్ర ఆర్థిక సంఘం నిధులు నేటివరకు పంచాయతీలకు ఇవ్వకపోవడం సిగ్గుచేటు. తక్షణం మొత్తం రూ.4041 కోట్లు విడుదల చేయాలి. సచివాలయాలను, వలంటీర్లను పంచాయతీల్లో విలీనం చేయాలి. సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాలి. గృహ సారథులను, సచివాలయ కన్వీనర్ల వ్యవస్థను తక్షణమే రద్దు చేయాలి. సర్పంచ్‌లకు రూ.15 వేలు, ఎంపీపీ, జడ్పీటీసీలకు రూ.30 వేలు పెంచాలి. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చించాలి.

\- కడలి గోపాలరావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు

### ఫ్రీజింగ్ ఆంక్షలు ఎత్తివేయాలి



గ్రామాల అభివృద్ధి కోసం నిధులు వినియోగించకుండా, పంచాయతీల సొంత నిధులపై ప్రభుత్వం విధిం చిన ఫ్రీజింగ్ ఆంక్షలు ఎత్తివేయాలి. ఐదో ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయాలి. ఆ సంఘం సిఫార్సుల మేరకు పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి. నాలుగేళ్లుగా పంచాయతీలకు ఇవ్వాల్సిన ఆర్థిక సంఘం బకాయి నిధులు విడుదల చేయాలి. సచివాలయ ప్రాంత అభివృద్ధికి కేటాయిస్తున్న రూ.20 లక్షల నిధులు పంచాయతీలకు ఇవ్వాలి. పంచాయతీ తీర్మానం మేరకే పనులు చేయించాలి. క్లాప్, మిత్రాలకు గతంలో లాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే వారికి జీతాలు ఇవ్వాలి.

\- పాలడుగుల లక్ష్మణరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు

# పులి ఎక్కడ దాగుంది ?

- చల్లచింతలపూడిలో కలకలం.. టెన్షన్‌లో ప్రజలు
- సోషల్ మీడియాలో వీడియోలు, ఫొటోల వైరల్



చల్లచింతలపూడిలో కనిపించిన పులి పాదముద్రలు

దెందులూరు/ఏలూరు క్రైం/ నల్లజర్ల, జనవరి 29: దెందులూరు మండలం చల్ల చింతల పూడి పరిసర ప్రాంతాల్లో పులి సంచరిస్తుందని డీఎఫ్‌ఓ రవీంద్ర దామ ప్రకటించడంతో ఆ ప్రాంత ప్రజలు మరింత అప్రమత్తమయ్యారు. పాటిమ్మతల్లి ఆలయం, పోలవరం కాల్వ గట్టు హైస్కూల్ సమీపంలో మాజీ సర్పంచ్ కమ్మ వెంకటేశ్వరావు.. పండువాళ్ల మొక్కజొన్న తోటలో సోమవారం సాయంత్రం ఐదుగంట సమయంలో పులిని చూశానని కేకలు వేయడంతో పక్కతోటలో ఉన్న వేమన రాముగౌడ్ వద్ద పని చేసే 10 మంది, మరో 300 మందితో కలిసి ఆయా తోటల వద్ద వెతికారు. చీకటి పడటంతో కనిపించలేదు. రెండు రోజుల క్రితం పెరుగుగూడెంలోని యలమర్తి వేణుగోపాల్ మొక్క జొన్న తోటలో పులి అడుగుల గుర్తించిన అధికారులు పులి కోసం గాలిస్తున్నారు. మొండూరు సమీపంలో, పోలవరం కుడికాలువగట్టు మొక్కజొన్నతోటలో పులి సంచారం జరిగిందంటూ అధికారులు గుర్తించడం.. పెద్దపులి అని చెప్పడంతో భయంతో ప్రజలు వణికిపోతున్నారు. అయితే ఇదే అదునుగా తీసుకున్న కొంతమంది ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడానికి గతంలో వివిధ ప్రాంతాల్లో అడవులను వదిలి పెట్టి రోడ్లపై వచ్చేసిన పులుల వీడియోలను తమ ప్రాంతాల పేర్లు పెట్టి, వాట్సాప్ గ్రూపుల్లోనూ, సోషల్ మీడియాలోనూ, ఫేస్‌బుక్కుల్లోను అప్‌లోడ్ చేస్తుండడంతో భయాందోళన చెందుతున్నారు. అటవీ అధికారులు మాత్రం ఎలాంటి భయాలకు లోనుకావద్దని అన్ని జాగ్రత్త చర్యలు తీసుకున్నామని, పశువులను జాగ్రత్త చేసుకోవాలని సూచించారు. తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో రెండు పెద్ద పులులు ఉన్నట్టు అంచనావేస్తున్నారు.

# క్రమబద్ధీకరణలోనూ తిరకాసేనా?!

**రెగ్యులరైజేషన్‌కు దూరమౌతున్న కాంట్రాక్టు వైద్యఉద్యోగులు**

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 29: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణకు అనుసరిస్తున్న మార్గదర్శకాలు లోపభూయిష్టంగా ఉండటంతో పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో ఎంపీహెచ్‌ఏ (మేల్)లుగా పనిచేస్తున్న 104 మంది రెగ్యులరైజేషన్‌కు దూరమవుతున్నందున సమస్య పరిష్కారానికి కలెక్టర్ నేరుగా జోక్యంచేసుకోవాలని అభ్యర్థించారు. ఇదే విషయమై సోమవారం స్థానిక ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఏపీ వైద్యఉద్యోగుల మినిస్టీరియల్ యూనియన్-3194 సమావేశంలోనూ సంఘ రాష్ట్ర కన్వీనర్ బట్టు విజయవర్ధన్ బాబు, కాపా నాగరాజు రెగ్యులరైజేషన్ విషయంలో ప్రభుత్వ జీవో 273 ప్రకారం కొత్తగా రూల్ ఆఫ్ రోస్టర్‌వేసి, దాని ప్రకారమే 'నిధి' పోర్టల్‌లో అర్హులైన ఉద్యోగుల వివరాలను అప్‌లోడ్‌చేయాలని డిమాండ్ చేశారు. వివరాలను సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నల్లా అప్పారావు, జె.గోవిందరావు వెల్లడించారు.

నిబంధనల ప్రకారం 2014 జూన్ రెండో తేదీకి ముందు నియమితులైన కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందని, దీనికి భిన్నంగా ఉమ్మడి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో 2017 నాటి కోర్టుకేసులను బూచిగా చూపించి జీవో 1207/2003 నోటిఫికేషన్‌లో నియమితులైనవారిని రెగ్యులరైజేషన్ ప్రతిపాదనలనుంచి మినహాయించిందని ఆరోపించారు. వాస్తవానికి 2017 కోర్టు కేసులతో వీరికి సంబంధంలేదని, కేవలం 104 మంది అభ్యర్థులకు రోస్టర్ పాయింట్లులేవన్న కారణంతో రెగ్యులరైజేషన్ ప్రక్రియను నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇదే విషయమై పలుమార్లు ఉమ్మడి జిల్లా డీఎంహెచ్‌వోకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఏవిధమైన స్పందనలేదని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రక్రియను పూర్తి చేయకుండా పెండింగ్‌లో వుంచి జిల్లా అధికారులే కాలయాపన చేశారని అన్నారు. ఇప్పటికైనా 2003 జీవో 1207 నోటిఫికేషన్‌లో నియమితులైన 104 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజేషన్ నిమిత్తం 'నిధి' పోర్టల్‌లో చేర్చకుండా వారి జీవితాలతో ఆడుకోవద్దని అభ్యర్థించారు. తక్షణమే రూల్ ఆఫ్ రోస్టర్(ఆర్‌వోఆర్)ను పూర్తిచేసి ప్రదర్శించాలని డిమాండ్ చేశారు.

**స్టేట్ ఆర్‌వోఆర్ ప్రకారమే ప్రతిపాదనలు : డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట**

కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియపై డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట వివరణ ఇచ్చారు. 'వైద్యఆరోగ్యశాఖ కమీషనర్ జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం స్టేట్ ఆర్‌వోఆర్‌ను రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ప్రామాణికంగాతీసుకుని ప్రతిపాదనలను పంపాలని అందిన ఆదేశాల మేరకే 118 మంది ఎంపీహెచ్‌ఏ (మేల్) ఉద్యోగుల వివరాలను అప్‌లోడ్‌చేశాం. ప్రస్తుతానికి జీవో 273లో నియమితులైన వారి వివరాలను మాత్రమే పంపమన్నారు.. అదనంగా మరి కొందరి వివరాలను కూడా పంపాలని ఆదేశిస్తే ఆమేరకు నడుచుకుంటాం.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన రిక్రూట్‌మెంట్‌లో కొన్ని వివాదాలు సుప్రీం కోర్టువరకు వెళ్లాయి.. వివాదరహితమైన రిక్రూట్‌మెంట్‌వరకే రెగ్యులరైజేషన్ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది.. ఇందులో జిల్లాస్థాయిలో నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండదు ' అని వివరించారు.

## ఇంటర్ పరీక్షలపై అవగాహన



మాట్లాడుతున్న ఆర్ఐఓ చంద్రశేఖర్‌బాబు

భీమవరం ఎడ్యుకేషన్, జనవరి 29 : త్వరలో జరగబోయే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై జిల్లాలో వివిధ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక గ్రంధి వెంకటేశ్వరరావు జూనియర్ కాలేజీలో ఇంటర్ బోర్డు ప్రాంతీయ ఇన్‌స్పెక్షన్ అధికారి (ఆర్ఐవో) కె.చంద్రశేఖర్ బాబు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నైతికత, మానవ విలువలు పరీక్ష ఫిబ్రవరి రెండున, పర్యావరణ విద్యా పరీక్ష మూడున నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ రెండు పరీక్షలు ఉత్తీర్ణులైతేనే ఇంటర్ పాస్ సర్టిఫికెట్ జారీ చేయబడుతుందని తెలిపారు. విద్యార్థి ఏ కళాశాలలో విద్య అభ్యసిస్తున్నారో అదే కళాశాలలో పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులందరూ తప్పనిసరిగా ఈ రెండు పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించాలన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి కెవి సత్యనారాయణ, జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు యమ్ నరసింహమూర్తి, ఎ రాజ్‌కృష్ణ, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జింక్ ధాతులోపం నివారించండి



పెనుమంట్ర, జనవరి 29 : మాగాణి భూముల్లో వరి సంవత్సరాల తరబడి సాగుచేయడంతో నేలలో జింక్ ధాతు లోపం (తుత్తునాగం) ఏర్పడి దిగుబడులు గణనీయంగా తగ్గుతాయని మార్టేరు వరి పరిశోధనస్థానం ప్రధాన సంచాలకురాలు డాక్టర్ ఎం.భరతలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ, పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో జింక్ లోపం ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఎర్ర తెగులుగా పిలిచే ఈ లోపాన్ని త్వరితగతిన గుర్తించి నివారణా చర్యలు చేపట్టాలన్నారు. లీటరు నీటికి 2.0 గ్రాముల జింక్ సల్ఫేట్ (0.2శాతం) కలిపి పైరంతా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. ఒక ఎకరాకు 20 లీటర్ల నీటిని పిచి కారీ చేయాలన్నారు.

## గుడ్డుకు గడ్డుకాలం!

- తగ్గుతున్న ధర.. రైతులకు తప్పని తిప్పలు



తణుకు, జనవరి 29: గుడ్డు ధర క్రమంగా తగ్గుతూ వస్తుంది. గత డిసెంబరులో రూ.6 ఉండేది. ప్రస్తుతం రూ. 5.5 పైసలు మాత్రమే ఉంది. రోజు రోజుకు తగ్గడంతో ఎంతవరకు ధర పడిపోతుందనే ఆందోళన రైతుల్లో నెలకొంది. గుడ్డు ధర ఆశాజనకంగా ఉండే పరిస్థితులు ఉన్నపుడు రైతులు కాస్త ఉపశమనం పొందిన దాఖలాలు ఉండేవి. కాని ధరలు తగ్గుతూ ఉండటం వల్ల వ్యయం పెరగడం వల్ల రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉభయ గోదావరి జిల్లాలో కోటి 30 లక్షల కోళ్లు ఉన్నాయి. కోటి 10 లక్షలు గుడ్లు ఉత్పత్తి అవుతుంది. మూడు వందల మంది రైతులు ఉన్నారు. గుడ్లలో 30 శాతం స్థానికంగా వినియోగం జరుగుతుంది. 70 శాతం.. ఈశాన్య రాష్ట్రాలకు రోజు 30 లారీలు వరకు ఎగుమతి అవుతున్నాయి.

# మృతదేహంతో ఆందోళన

- భూ యజమానుల దాడిలో వ్యక్తి మృతి.. న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల డిమాండ్
- నిందితులను శిక్షించండి : పోలీసులతో చర్చించిన ఎమ్మెల్యే మంతెన
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



ఆకివీడు పోలీస్ స్టేషన్ ఎదుట హైవేపై మృతదేహంతో ఆందోళన చేస్తున్న బాధితులు, (ఇన్‌సెట్) మృతుడు జాన్‌పీటర్

ఆకివీడు, జనవరి 29: భూ యజమానులు దాడి చేయడం వల్లే తమ కుమారుడు మృతి చెందాడని, న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు బంధువులతో కలిసి సోమవారం పోలీస్ స్టేషన్ వద్ద జాతీయ రహదారిపై మృతదేహంతో ఆందోళనకు దిగడంతో కిలోమీటర్లమేర ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే మంతెన రామరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల రత్నం ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులతో చర్చలు జరిపారు. ఫిర్యాదు స్వీకరించి బాధితులకు న్యాయం చేయాలని కోరడంతో అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలివి. చినకాపవరంలో అత్తిలికి చెందిన అనంతపల్లి బంగారయ్యకు ఉన్న 4.35 ఎకరాలు వ్యవసాయ భూమి ఉంది. చినకాపవరానికి చెందిన పెద్దిరెడ్డి శ్రీనివాసరావు 1982 నుంచి కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. బంగారయ్య కుమారుడు వెంకటరత్నం 2020 మార్చి 15న అమ్మకానికి బేరం పెట్టి శ్రీనివాసరావును తప్పుకోవాలని కోరారు. తనకే పొలం అమ్మాలని కోరగా అమ్మనని చెప్పడంతో పెద్దల్లో పెట్టారు. అయినా కుదరకపోవడంతో శ్రీనివాసరావు భీమవరం జూనియర్ సివిల్ కోర్టులో వేశారు. అప్పటి నుంచి ఇద్దరూ కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. శ్రీనివాసరావు వాదనలు పూర్తికాగా, వెంకటరత్నం వాదనలు వాయిదా పడ్డాయి.

గత ఏడాది డిసెంబరు 31న వెంకటరత్నం, వబిలిశెట్టి రాజా మరో 80 మందిని తీసుకొచ్చి చేను ఊడ్చడానికి ప్రయత్నించగా శ్రీనివాసరావు, అతడి కుమారుడు జాన్‌పీటర్ అడ్డుకున్నారు. భూయజమానులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో శ్రీనివాసరావును పోలీసులు పిలిపించారు. కోర్టులో ఉందని చెప్పడంతో సివిల్ విషయం.. మీరు కోర్టులోనే తెల్చుకోవాలన్నారు. ఈ నెల 27న వెంకటరత్నం, రాజా మరి కొందరితో కలిసి పొలంలోకి వచ్చి శ్రీనివాసరావుపై దౌర్జన్యం చేస్తుండడంతో అతడి కుమారుడు జాన్‌పీటర్ అడ్డువెళ్లాడు. వెంకటరత్నం.. అతడిని చంపేయండి అనడంతో దత్తాడి అబ్రహం అనే వ్యక్తి జాన్‌పీటర్ వీపు వెనుక భాగంలో కత్తితో పొడిచాడు. మిగిలిన వారు పిడిగుద్దులు గుద్దారు. గాయాలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులను ముందు ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలని పోలీసులు చెప్పడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాం. వెంకటరత్నం, రాజాకు ఎటువంటి గాయాలు లేకపోయినప్పటికి వారు కూడా ఆసుపత్రిలో చేరారు. ఇదిలా ఉండగా ఆదివారం రాత్రి పరస్పర ఫిర్యాదులు చేయడంతో ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేశారు. కత్తితో పొడవడంతో చికిత్స పొందుతూ జాన్‌పీటర్ చనిపోయాడని ఆరోపిస్తూ సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు పోలీస్ స్టేషన్‌కు వచ్చి జాతీయ రహదారిపై మృతదేహంతో న్యాయం చేయాలంటూ బాధితులు ఆందోళనకు దిగారు. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఉండి ఎస్ఐ లక్ష్మణ్, కాళ్ల ఎస్ఐ వీరభద్రరావు తమ తమతమ సిబ్బందితో వచ్చి బాధితులతో చర్చించారు. మృతదేహన్ని పక్కకు పెట్టి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసే వరకూ మృతదేహన్ని ఇక్కడి నుంచి తరలించమని భీష్మించారు. స్పెషల్ బ్రాంచి పోలీసు బలగాలను రప్పించారు. ఎమ్మెల్యే మంతెన రామరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల రత్నం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు పోలీసులతో చర్చలు జరిపారు. ఎట్టకేలకు అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేయడంతో మధ్యాహ్నం 3.45 గంటలకు మృతదేహన్ని తీసుకెళ్లడంతో ఆందోళన సద్దుమణిగింది.




బాధితులతో కలిసి ఫిర్యాదు అందజేస్తున్న ఎమ్మెల్యే రామరాజు

## క్రైం కార్నర్

### అంగన్‌వాడీ ఉద్యోగాల పేరిట టోకరా.. కేసు నమోదు

పోలవరం, జనవరి 29 : అంగన్‌వాడీ ఉద్యోగాల పేరిట నిరుద్యోగులకు టోకరా వేసి రూ.లక్షలు కాజేసిన ఘటనపై పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. వివరాలివి. పోలవరం పంచాయతీ నూతనగూడెం గ్రామానికి చెందిన తాడిమళ్ల తులసి లక్ష్మి, అనిశెట్టి రామలక్ష్మి, టి.లక్ష్మీ జ్యోతి వద్ద కొయ్యలగూడెం మండలం రవ్వావారిగూడేనికి చెందిన చవలం వరప్రసాద్, ఏలూరు జిల్లా అంకన్నగూడెం గ్రామానికి చెందిన అమర్తల నాగఫణీంద్ర.. అంగన్‌వాడీ ఉద్యోగాలిప్పిస్తానని నమ్మబలికి 2021లో ఒక్కొక్కరి వద్ద రెండు లక్షల రూపాయల చొప్పన తీసుకున్నారు. మోసపోయామని గ్రహించి సొమ్ములు తిరిగి ఇవ్వమంటే రేపు మాపు అంటూ కాలం గడుపుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పవన్ కుమార్ చెప్పారు.

### ఇద్దరు మద్యం విక్రేతలపై కేసు

టి.నరసాపురం/ఏలూరు క్రైం, జనవరి 29: వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా మద్యం బాటిల్స్ విక్రయిస్తున్న ఇద్దరిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి. టి.నరసాపురం మండలం బందంచర్లలో అక్రమంగా మద్యం బాటిల్స్ విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ తన సిబ్బందితో దాడి చేశారు. రూ.1,040 విలువ చేసే ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఏలూరు హనుమాన్‌నగర్‌కు చెందిన కొండవీటి ముత్యాలరావు ఆదివారం రాత్రి మద్యం విక్రయిస్తున్నట్లు త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందింది. సీఐ వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో నిఘా పెట్టి అతడిని పట్టుకున్నారు. నాలుగు మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### తెలంగాణ మద్యం రవాణా.. ఒకరి అరెస్ట్



మద్యం బాటిల్స్‌తో పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 29: తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌లో తెలంగాణ మద్యం అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని జీఆర్‌పీ ఎస్ఐ సోమవారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.28,560 విలువగల మద్యం స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి. రైల్వేస్టేషన్ వద్ద గంజాయి, బంగారం, అక్రమ మద్యం రవాణా చేస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సాయినగర్ ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్న వీకర్స్ కాలనీకి చెందిన బద్దిరెడ్డి సూరిబాబు బ్యాగ్‌ను పోలీసులు తనిఖీ చేశారు. తెలంగాణకు చెందిన మద్యం సీసాలను గుర్తించారు. వాటిని సీజ్‌చేసి అతడిపై కేసు నమోదుచేసినట్టు చెప్పారు.

### 17 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

భీమవరం క్రైం/పాలకోడేరు, జనవరి 29 : వివిధ ప్రాంతాల్లో పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు చేసి 17 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.66,210 స్వాధీనం చేసుకున్నారు. భీమవరం టౌన్ హాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి పది మందిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. రూ.11,320 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పాలకోడేరు మండలం గొల్లలకోడేరులో ఏడుగురిని అరెస్ట్ చేసి ఏడు సెల్‌ఫోన్‌లు, రూ.54,890 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు భీమవరం రూరల్ సీఐ వై. సత్యకిషోర్ తెలిపారు.

### పోలీసుల అదుపులో కోడి పందేలరాయుళ్లు

పాలకోడేరు, జనవరి 29 : శృంగవృక్షం శివారు బంటుమిల్లిలో సోమవారం కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులో తీసుకున్నారు. రెండు కోళ్లు, రెండు కత్తులు, నాలుగు బైక్‌లు, రూ.10,490 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు భీమవరం రూరల్ సీఐ వె. సత్యకిషోర్ తెలిపారు.

### 11వ రోజు సెల్‌టవర్ దిగొచ్చిన ఏసు



ఏసుకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న అధికారులు

భీమవరం క్రైమ్, జనవరి 29 : తన తండ్రికి సంబంధించి ప్రమాద భీమా పత్రాలను బ్యాంకు అధికారులు ఇవ్వాలంటూ గత 11 రోజులుగా సెల్‌టవర్‌పై చేస్తున్న దీక్షను లోకం ఏసు సోమవారం విరమించారు. సురక్షితంగా కిందకు దిగి వచ్చిన వెంటనే అధికారులు నిమ్మరసం ఇచ్చి బంధువులకు అప్పగించారు. ఆర్డీవో కె.శ్రీనివాసులరాజు, అగ్నిమాపక జిల్లా అధికారి కె. శ్రీనివాసు, డిఎస్పీ బి. శ్రీనాథ్, తహసీల్దార్ వై.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీలు పెంచబోం

- ఆదాయ అంచనాలు రూ.21,162 కోట్లు
- ప్రతిపాదిత ధరల రాబడి రూ.100.44 కోట్లు
- రైల్వే ట్రాక్షన్ చార్జీలు యూనిట్‌కు రూపాయి పెంపునకు ప్రతిపాదన
- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్



విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులపై 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారం మోపడం లేదని, చార్జీలు పెంచడం లేదని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ వెల్లడించారు. స్థానిక కార్పొరేట్ కార్యాలయంలో ఏపీఈఆర్‌సీ సోమవారం నిర్వహించిన టారిఫ్ ప్రతిపాదనల స్వీకరణ, ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన డిస్కమ్ ప్రగతి, ప్రతిపాదనలు వివరించారు.

కేవలం రైల్వే ట్రాక్షన్ చార్జీలను మాత్రం యూనిట్‌కు రూపాయి పెంచడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. నాలుగేళ్ల నుంచి యూనిట్‌కు రూ.5.50 మాత్రమే వసూలు చేస్తున్నామని, సర్వీసు ధర 40 శాతం పెరిగిందని, ఈ నేపథ్యంలో పెంపు అనివార్యమన్నారు. దీనివల్ల డిస్కమ్‌కు అదనంగా రూ.100.24 కోట్లు సమకూరుతుందన్నారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్లను ఓల్టేజ్ సర్వీసు వ్యయంతో టారిఫ్‌కు లింకు చేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుత ధరల నుంచి రూ.17,854.16 కోట్ల ఆదాయం వస్తుందని, ప్రతిపాదిత ధరల ద్వారా రూ.100.44 కోట్లు, ప్రతిపాదిత పర్ కాస్ట్ రికవరీ నుంచి రూ.3,207.27 కోట్లు కలిపి మొత్తం రూ.21,161.86 కోట్లు వస్తుందని అంచనా వేసినట్టు వివరించారు. రాబడి లోటు ఏమీ లేదని స్పష్టంచేశారు.

**కొనుగోలు ఖర్చు యూనిట్ రూ.4.69**

రాబోయే ఆర్థిక సంవత్సరంలో యూనిట్‌కు విద్యుత్ కొనుగోలు ఖర్చు రూ.4.69గా ఉంటుందని, ప్రసారం, పంపిణీ నష్టాల వ్యయం 49 పైసలు, నెట్ వర్క్ ఖర్చులు రూ.1.63, ఇతర ఖర్చులు 28 పైసలు కలిపి సర్వీసు వ్యయం యూనిట్‌కు రూ.7.09 అవుతుందని వివరించారు. సగటున యూనిట్‌కి రూ.6.01 వస్తుందని, రెండింటి మధ్య తేడా యూనిట్‌కి రూ.1.08 ఉంటుందని అంచనా వేశారు. గృహ వినియోగం 7,741.84 మిలియన్ యూనిట్లు ఉంటుందని, దాని ద్వారా రూ.3,764.76 కోట్లు వస్తుందని అంచనా వేశారు. వాణిజ్యానికి 1,501.26 మి.యూ. ఇవ్వడం ద్వారా రూ.1,534.45 కోట్లు వస్తుందని, పరిశ్రమలకు 494.59 మి.యూ. ఇవ్వడం వల్ల రూ.406.87 కోట్లు వస్తుందని, వ్యవసాయం, వాటి అనుబంధ రంగాలకు 4,767.55 మి.యూ. ఇస్తే రూ.1,000.71 కోట్లు వస్తాయని, సంస్థాగతంగా 508.32 మి.యూకు రూ.384.32 కోట్లు రావచ్చునని మొత్తం చూసుకుంటే ఎల్‌టీ విభాగంలో 15,013.56 మి.యూ.కు రూ.7,091.11 కోట్లు వస్తాయని అంచనాలు చూపించారు. అదే హెచ్‌టీ విభాగంలో అయితే రూ.14,840.50 మి.యూ.కు రూ.10,673.34 కోట్లు వస్తుందని వివరించారు.

# రేపే నన్నయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం

- ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుధామూర్తికి గౌరవ డాక్టరేట్



మాట్లాడుతున్న వీసీ పద్మరాజు

రాజమహేంద్రవరం, జనవరి 29: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13, 14, 15వ స్నాతకోత్సవాలు బుధవారం నిర్వహిస్తున్నట్టు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు సోమవారం తెలిపారు. ఈ నెల 31న వర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో జరిగే కార్యక్రమంలో వీసీతోపాటు గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతులమీదుగా పట్టాల ప్రదానం జరుగుతుందని తెలిపారు. ముఖ్యఅతిథిగా ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు పద్మభూషణ్ సుధామూర్తి హాజరవుతారని, ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్నామని చెప్పారు. నన్నయ యూనివర్సిటీలో 2019-20, 2020-21, 2021-22 విద్యాసంవత్సరాలకు చెందిన పీహెచ్‌డీ, పీజీ, పీజీ డిప్లొమా, యూజీ, ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసిన వారికి పట్టాలు అందిస్తామన్నారు. వివిధ కోర్సులకు చెందిన 500 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. వీరిలో పీహెచ్‌డీ 12, గోల్డ్ మెడల్స్ 12, ప్రైజ్ 12 మిగిలిన వారు పీజీ కోర్సులు, ఎంఏ, ఎంకామ్, ఎంబీఏ, ఎల్‌ఎల్‌ఎం, ఎంఎస్సీ, ఎంసీఏ, ఎంఈడీ, ఎల్‌ఎల్‌బీ, బీఈడీ వంటి కోర్సులు పూర్తిచేసిన వారు ఉన్నారని వివరించారు. విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలలో పీజీ పూర్తి చేసిన 8,582, యూజీ పూర్తి చేసిన 5,0173 మంది విద్యార్థుల పట్టాలు ఆమోదిస్తారన్నారు. అతిథులుగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత విద్య ప్రిన్సిపల్ కార్యదర్శి జె.శ్యామలరావు, కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్, ఉన్నత విద్య మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఉన్నతాధికార్లు, విశ్వవిద్యాలయ ప్రముఖులు హాజరవుతారని చెప్పారు. స్నాతకోత్సవ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.



బాలుర విభాగంలో ప్రథమస్థానం పొందిన విజయనగరం జిల్లా జట్టు

## ముగిసిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు

- బాలబాలికల విభాగంలో విజయనగరం, నెల్లూరు జిల్లా జట్లు ప్రథమం

జంగారెడ్డిగూడెం, జనవరి 29 : స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న 67వ రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ అండర్- 19 బాలబాలికల పోటీలు సోమవారం ముగిశాయి. బాలుర విభాగంలో విజయనగరం జిల్లా ప్రథమస్థానం, పశ్చిమ గోదావరి ద్వితీయ, శ్రీకాకుళం జిల్లా తృతీయ స్థానంలో నిలిచాయని ఏలూరు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ డి. రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. బాలికల విభాగంలో నెల్లూరు ప్రథమస్థానం, పశ్చిమ గోదావరి ద్వితీయ, విశాఖపట్నం తృతీయ స్థానాలు సాధించాయని వివరించారు.



హ్యాండ్‌బాల్ ఛాంపియన్ పశ్చిమగోదావరి జిల్లా బాలుర జట్టు

## హ్యాండ్‌బాల్ విజేత పశ్చిమ గోదావరి జట్టు

ఉంగుటూరు, జనవరి 29: రెండు రోజులపాటు జరిగిన అండర్-19 అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. పోటీల్లో మొత్తం 11 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో పశ్చిమ గోదావరి జిల్లా జట్టు విశాఖ జట్టుపై విజయం సాధించింది. ద్వితీయ స్థానాన్ని విశాఖ, తృతీయస్థానాన్ని నంద్యాల పట్టు కైవసం చేసుకున్నాయి. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రామాంజనేయులు, ఒలింపిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిరెడ్డి సత్యనారాయణ కప్‌లు అందజేశారు. రాజారావు, చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న త్రిమూర్తి, విజయ్‌వర్ధన్‌బాబు

## అయుష్ అండ్ ఫిజియోథెరపీ ఇంటర్ కాలేజ్ క్రీడా పోటీలు ప్రారంభం

పెంటపాడు, జనవరి 29: ప్రత్తిపాడు ఏఎస్ఆర్ హోమియో మెడికల్ కళాశాలలో విజయవాడ డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని ఆయుష్ అండ్ ఫిజియోథెరపీ ఇంటర్ కాలేజ్ రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వైఎస్ఆర్ హెల్త్ వర్సిటీ డాక్టర్ ఈ.త్రిమూర్తి, ఏఎస్ఆర్ మెడికల్ కళాశాల చైర్మన్ ఆకుల విజయవర్ధన్ పోటీలను ప్రారంభించారు. త్రిమూర్తి మాట్లాడుతూ, హెల్త్ వర్సిటీ పరిధిలో రాష్ట్రం నుంచి హోమియో, ఆయుర్వేదిక్, ఫిజియోథెరపీ కళాశాలలకు చెందిన విద్యార్థులు క్రీడలలో పాల్గొన్నారన్నారు. మూడు రోజులపాటు క్రీడలు కొనసాగుతాయన్నారు. విజయ్‌వర్ధన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడలకు ప్రత్తిపాడు ఏఎస్ఆర్ కళాశాల వేదిక అవ్వడం ఆనందంగా ఉందన్నారు. తొలిరోజు వాలీబాల్, క్రికెట్, బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, త్రోబాల్, అథ్లెటిక్స్ బాలురు, బాలికల విభాగాలలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్, శ్రీనివాసరాజు, డాక్టర్ సురేంద్రకుమార్, డాక్టర్ సాయిరాం పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారిణిలు

## కొనసాగిన రోప్ స్కిప్పింగ్ పోటీలు



రోప్ స్కిప్పింగ్ ఆడుతున్న క్రీడాకారులు

భీమవరం అర్బన్, జనవరి 29: స్థానిక చింతలపాటి బాపిరాజు స్మారకోన్నత పాఠశాలలో జరుగుతున్న అంతర్ జిల్లాల 67వ స్కూల్ గేమ్స్ రోప్ స్కిప్పింగ్ పోటీలు రెండో రోజు సోమవారం కొనసాగాయి. అండర్- 14, 17, 19 విభాగాల్లో బాలబాలికలు 13 జిల్లాల నుంచి 405 మంది పాల్గొన్నారని నిర్వాహకులు చెప్పారు. పలు విభాగాల్లో పోటీలను నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తామని కన్వీనర్ జీవీసీ శేఖర్‌రాజు తెలిపారు.

## నేడు జడ్పీ స్థాయీసంఘ సమావేశాలు

ఏలూరుసిటీ, జనవరి 29: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు మంగళవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్థానిక జడ్పీ కార్యాలయంలో నిర్వహిస్తారని సీఈవో కె.ఎస్.ఎస్. సుబ్బారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షత వహిస్తారన్నారు. ప్రణాళిక , ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, విద్యా వైద్య సేవలు, మహిళా సంక్షేమ, సాంఘిక సంక్షేమ స్థాయీ సంఘం సమావేశాలు జరుగుతాయని ఆయన వివరించారు. స్థాయీ సంఘాల వారీగా జిల్లా అధికారులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష, పరిపాలనకు సంబంధించిన అజెండా అంశాలు ఆమోదించటం జరుగుతుందని అన్నారు. జడ్పీటీసీ సభ్యులు, అధికారులు హాజరుకావాలన్నారు.

## వీరేశ్వరస్వామి ఆలయానికి పంచలోహ విగ్రహాలు



పోలవరం, జనవరి 29 : పట్టిసీమ వీరేశ్వరస్వామి దేవస్థానానికి రాజమహేంద్రవరానికి చెందిన మడిచర్ల సుధాకరరావు, వెంకటలక్ష్మి దంపతులు స్వామి, అమ్మవార్ల పంచలోహ విగ్రహాలు, సింహాసనం బహూకరించినట్లు ఈవో ఎస్.ఎస్. సంగమేశ్వర శర్మ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.1.30 లక్షలు ఉంటుందన్నారు. దంపతులు స్వామికి శాంతి కల్యాణం, హోమం నిర్వహించినట్టు చెప్పారు. ధర్మ ప్రచారంలో భాగంగా ఈ నెల 30న ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడు రామాలయం వద్ద, 31న పోలవరం పెద రామాలయం వద్ద భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు విధిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేవస్థానంలో సోమవారం జరిగిన శాంతి కల్యాణంలో కామిశెట్టి నాగరాజు దంపతులు, వెంకటరమణ, క్రాంతికిరణ్ పాల్గొన్నట్టు ఈవో వివరించారు.

## శ్రీవారి హుండీల ఆదాయం రూ.3.34 కోట్లు



ద్వారకాతిరుమల, జనవరి 29: ద్వారకా తిరుమలవాసునికి హుండీల లెక్కింపు ద్వారా 32 రోజుల కాలానికి రూ.3.34 కోట్లు భారీ ఆదాయం సమకూరింది. స్థానిక ప్రమోద కల్యాణ మండప ఆవరణలో సోమవారం అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీల లెక్కింపును నిర్వహించారు. హుండీల ద్వారా లభించిన రూ. 3,34,81,330 నగదుతోపాటు, 418 గ్రాముల బంగారం, 14.660 కేజీల వెండి లభించినట్లు ఈఓ వి. త్రినాథరావు తెలిపారు. అలాగే రద్దయిన పాతనోట్లు రూ.500 (17), 1000(1), 2000(114) తో పాటుగా విదేశీ కరెన్సీ సైతం అధికంగా లభించింది.

# పట్టణంలో సమస్యల వెల్లువ

**● జంగారెడ్డిగూడెంలో మన ఊరు.. మన వార్డు కార్యక్రమం ● వినతులతో ప్రజాప్రతినిధులు ఉక్కిరిబిక్కిరి**

జంగారెడ్డిగూడెం, జనవరి 29: ఎన్నికల వేళ 'మన ఊరు మన వార్డు' అంటూ ప్రజల వద్దకు వెళుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులకు దిమ్మతిరుగుతోంది. పట్టణ ప్రజల నుంచి సమస్యలు, వినతిపత్రాల వెల్లువతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులకు జవాబు ఇవ్వలేని పరిస్థితిలో నచ్చజెప్పి పంపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో అభివృద్ధిపై సమగ్ర సమావేశం అంటూ ఏర్పాటు చేసిన శిబిరాల్లో ప్రజల సమస్యలకు కనీసం సమాధానం చెప్పలేని పరిస్థితి ఎదురైంది. టిడ్కో ఇళ్లకు సొమ్ము చెల్లించాం, ఇళ్లు ఇవ్వలేదని, బ్యాంక్‌లో తమ పేరిట రుణం ఉందంటూ బాకీ కట్టాలని అడుగుతున్నారని ఒక బాధితురాలు వాపోయింది. తాగు నీరు అందడం లేదని, డ్రైనేజీలు పూడిక తీసి నెలలు గడుస్తున్నాయి, దోమలతో పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని కొంత మంది, మా ఇంటికి నెలకు రూ.5వేలు కరెంటు బిల్లు వస్తుందని ఇంకో మహిళ మొరపెట్టుకున్నారు. పట్టణంలోని మూడో వార్డులోనే తాగు నీరు, పారిశుధ్యం, విద్యుత్ బిల్లు, పింఛన్, టిడ్కో ఇళ్ల సమస్యలపై మొత్తం 19 ఫిర్యాదులు అందాయి. విద్యుత్ బిల్లు అధికంగా వస్తుందని మహిళలు వాపోయారు. టిడ్కో ఇల్లు కేటాయించకుండానే రుణం చెల్లించాలని బ్యాంకర్లు నోటీసులు ఇవ్వడంపై బాధిత మహిళ కె.లక్ష్మి అధికారులను ప్రశ్నించింది. కార్యక్రమంలో పాల్గొన్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామన్నారు. కమిషనర్ భవాని ప్రసాద్‌తో పాటు అధికారులు, కౌన్సిలర్లు, నాయకులు వినతిపత్రాలు స్వీకరించడం మినహా సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది.



వినతులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, అధికారులు

## నగరంలో పారిశుధ్యం మెరుగుపరచాలి



ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న జనసేన బృందం

ఏలూరు కార్పొరేషన్, జనవరి 29: నగరం అపారిశుధ్యంతో దుర్వాసన వస్తుందని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. నగరంలో పారిశుధ్యం మెరుగుపరచకుంటే మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. స్థానిక ఆముదాల అప్పలస్వామి కాలనీలో ఖాళీగా ఉన్న కామన్ సైట్లను అధికార పార్టీ ప్రతినిధులు ఆక్రమించాలని చూస్తున్నారని, అదే జరిగితే అనేక ఆందోళనలు చేపడతామన్నారు. ఆయన వెంట నగిరెడ్డి కాశీ నరేష్, పైడి లక్ష్మణరావు, ఒబిలిశెట్టి శ్రావణకుమార్‌గుప్త, సరిది రాజేష్, కావూరి వాణిశ్రీ, వీరంకి పండు, రెడ్డి గౌరీశంకర్, తుమ్మపాల ఉమాదుర్గ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ పాలనలో దళితులు, బీసీలకు అన్యాయం

చింతలపూడి, జనవరి 29: జగన్ పాలనలో దళితులు, బీసీలు, రిజర్వుడు నియోజకవర్గాలకు అన్యాయం జరిగిందని జనసేన చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చింతలపూడి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలో ఏవిధమైన అభివృద్ధి జరగలేదన్నారు. జగన్ పాలనలో ఎస్సీ, బీసీలకు న్యాయం జరగదని జనసేన గతంలోనే చెప్పిందని, దళిత డాక్టర్ సుధాకర్, ఎమ్మెల్సీ అనంతబాబుకు చెందిన డ్రైవర్ మృతి కేసులో ఏ న్యాయం జరిగిందో దళితులందరికీ తెలుసన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం నిధులను దారిమళ్ళించి పథకాన్ని మూలనపడేశారన్నారు. టీడీపీ, జనసేనలో భారీ చేరికలు ఉన్నాయన్నారు.

## గ్రంథ పఠనంతో విజ్ఞానం : కలెక్టర్



పుస్తకాలను పరిశీలిస్తున్న కలెక్టర్

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 29: విద్యార్థులను జ్ఞానవంతులుగా చేయడంలో గ్రంథాలయాలు దోహదపడతాయని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులు రూ.10 లక్షలు చొప్పున కస్తూరిబా బాలికోన్నత పాఠశాల, కొవ్వలి జడ్పీ హైస్కూలు, రూ.24లక్షలతో ఆదివారపుపేట ఏఆర్‌డీజీకే మున్సిపల్ హైస్కూళ్లలో నిర్మించిన లైబ్రరీ గదులను, పుస్తకాల అల్మారాలు, గ్రంథాలను సోమవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులు తమకు నచ్చిన పుస్తకాలను ఇంటికి తీసుకెళ్ళి చదివి, తిరిగి వాటిని పాఠశాల గ్రంథాలయంలో భద్రపరిచేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరారు. లైబ్రరీలో మరిన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచేందుకు సహకరిస్తానన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న బాలబాలికలకు బెస్టాఫ్ లక్ చెప్పారు. డీఈవో పి.శ్యాంసుందర్, మున్సిపల్ అదనపు కమీషనర్ బాపిరాజు, హెచ్‌ఎంలు సునీత, ఉజ్వల పాల్గొన్నారు.

## రైళ్లలో అక్రమ రవాణాపై సమాచారం ఇవ్వాలి



అవగాహన కల్పిస్తున్న రైల్వే ఏఎస్ఐ సైమన్

ఏలూరు క్రైం, జనవరి 29 : రైళ్లలో ఏమైనా అక్రమ రవాణా జరిగితే రైల్వే అధికారులకు, జీఆర్‌పీ లేదా ఆర్‌పీఎఫ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏలూరు రైల్వే ఏఎస్ఐ సైమన్ సూచించారు. ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ముఠా కూలీలు, చిరుతిళ్ల విక్రయదారులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాలు, మద్యం, బంగారం, డబ్బులు అక్రమంగా రవాణా జరిగితే తమకు తెలియజేయాలన్నారు. ఆర్‌పీఎఫ్ సిబ్బంది, రైల్వే పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

పెదపాడు, జనవరి 29: వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా సురక్షితంగా గమ్యం చేరుకోవచ్చని ఎస్సై శుభశేఖర్ తెలిపారు. బస్టాండ్ సెంటర్‌లో సోమవారం వాహనాల తనఖీలు నిర్వహించి పలు వాహనాలకు అపరాధ రుసుం విధించారు. ఎస్సై శుభశేఖర్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా, మద్యం సేవించి వాహనాలను నడపటం వల్ల జరిగే ప్రమాదాల్లో కొన్నిసార్లు ప్రాణపాయం కూడా సంభవిస్తుందన్నారు. వాహన తనిఖీల్లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగివుండాలి




సదస్సులో మాట్లాడుతున్న పెంటారావు

బుట్టాయగూడెం, జనవరి 29: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీఐడీ డీఎస్పీ సీహెచ్.పెంటారావు అన్నారు. రాజమహేంద్రవరం సీఐడీ, ఐటీడీఏ ఆధ్వర్యంలో సోమవారం చట్టాలు, హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. చట్టాల అవశ్యకత ఇతర అంశాలను పెంటారావు వివరించారు. రాజ్యాంగ పరమైన హక్కులు, గిరిజనులకు సంబంధించిన కమిటీలను ఐటీడీఏ ఏపీవో వీవీఎస్ నాయుడు వివరించారు. సీఐడీ డీఎస్పీ బి.రామకృష్ణ పున్నయ్య కమిషన్, బాధితులకు రావలసిన నష్టపరిహారం ఇతర అంశాలను వివరించారు. పోలవరం డిఎస్పీ రతన్‌రాజు ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం గిరిజన తెగల హక్కుల చట్టాలపై అవగాహనకు సంబంధించిన మెటీరీయల్‌ను అందజేశారు. సీఐడీ సీఐ వీవీవీ.నరసింహరావు, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి ఎస్సైలు కె.వెంకన్న, ఇ.క్రాంతికుమార్, సీఐడీ ఎస్సైలు కె.ఫణికుమార్, వై.శ్రీనివాసరావు, సిబ్బంది ఏజెన్సీ మండలాల ప్రజాప్రతినిధులు, గిరిజనులు పాల్గొన్నారు.

## కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి




అమరవీరులకు జోహార్లు తెలుపుతున్న కార్మికులు

జంగారెడ్డిగూడెం, జనవరి 29: కేంద్రలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై నెల్లిమర్ల అమర వీరుల స్పూర్తితో ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి కేవీ.రమణ పిలుపునిచ్చారు. నెల్లిమర్ల జూట్ ఉద్యమంలో పోలీసు కాల్పులతో అమరులైన ఐదుగురు అమరవీరుల 30వ వర్ధంతి సందర్భంగా మార్కెట్ యార్డు దగ్గర ముప్పిడి అబ్బులు అధ్యక్షతన సోమవారం సభ నిర్వహించారు. కేవీ.రమణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేసుకునేందుకు హిందుత్వవాదంతో మత విద్వేషాలు రగిల్చి ప్రజల మధ్య చీలికలు తెస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం కేంద్రానికి లొంగిపోయి అదే విధానాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. ఐఎఫ్‌టీయూ నాయకులు పొడిదోలు దుర్గారావు, గంపల వెంకటేష్, కొలుకులూరి శ్రీను, అబ్బులు, దొండపాటి వెంకటేశ్వరరావు, దున్నా రాధాకృష్ణ, కట్టా బాలాజీ పాల్గొన్నారు.

## వలస గిరిజన గ్రామాలకు సౌకర్యాలు కల్పించాలి




వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

కుక్కునూరు, జనవరి 29: వలస గిరిజన గ్రామాలకు సౌకర్యాలు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి ఎం.వెంకటాచారి డిమాండ్ చేశారు. కుక్కునూరులో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. 20 ఏళ్ల క్రితమే బతుకు తెరువు కోసం వలస వచ్చి అటవీ ప్రాంతాల్లో ఉంటున్న వలస గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, ఇతరేత్ర సౌకర్యాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పూర్తి స్థాయిలో సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె.బాబూరావు, నరసింహారావు, కె.సోమయ్య, భీమ తదితరులు పాల్గొన్నారు.

## డీటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 29: డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.కాంతారావు, ఎం.ఆదినారాయణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఎస్‌ఏవీ.సుబ్రహ్మణ్యం, కార్యదర్శులుగా బి.వెంకటేశ్వరరావు, ఎం.సత్యం, డి.సురేష్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వి.కృష్ణశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎస్‌వీ.శ్రీనివాసరావు, కె.సురేష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. మండలాల కన్వీనర్లుగా ఏలూరుకు కె.దాసు, కామవరపుకోటకు ఎ.రవి, బుట్టాయిగూడెంకు ఏ.ఏసుదాసులను ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.నరహరి తదితరులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న గన్ని వీరాంజనేయులు



బూత్ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న చింతమనేని



కె.కోట మండలం జలపావారిగూడెంలో ప్రచారం



బడేటి చంటి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

# ఓటర్ జాబితాపై నిఘా

**తేడాలపై దృష్టి సారించిన టీడీపీ**

**బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలకు జిల్లా అధ్యక్షుడి సూచనలు**

భీమడోలు, జనవరి 29: బూత్ క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ ఇన్‌చార్జులు ఓటర్ల సమాచారంలో తేడాలపై దృష్టి సారించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు సూచించారు. భీమడోలులోని గన్ని క్యాంపు కార్యాలయంలో సోమవారం బూత్‌ల వారీగా క్లస్టర్ ఇన్‌చార్జి, బూత్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులకు సమావేశం నిర్వహించారు. ఓటర్ల వెరిఫికేషన్ పకడ్బందీగా జరగాలని ఎటువంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వరాదన్నారు. ఓటరు లిస్టులుల్లో తేడాలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు, పాల్గొన్నారు.

● పెదవేగి: పార్టీ చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యతను కార్యకర్తలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. దెందులూరు నియోజకవర్గ టీడీపీ బూత్ కన్వీనర్ల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగింది. క్షేత్రస్థాయిలో పార్టీ మరింత బలోపేతం కావడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ప్రత్యేక చొరవ చూపించాలన్నారు. పార్టీ అనుసరించే విధానాలు, అమలు చేసే పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల మధ్యకు తీసుకెళ్ళి, వారిని పార్టీ కార్యక్రమాలకు చేరువ చేయాలని ఆయన సూచించారు. ఉప్పలపాటి శ్రీరామ్‌ప్రసాద్, తాతా సత్యనారాయణ, బొప్పన సుధాకర్, మాగంటి నారాయణ ప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, నంబూరి నాగరాజు, మోరు శ్రావణి, మంచినేని శ్రీనివాసరావు, కొనకళ్ళ శివమణి, అయినాల వెంకట నారాయణ, బొడ్డేటి మోహన్‌బాబు, గారపాటి కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

### బాబు వస్తేనే రాష్ట్ర భవిష్యత్

జగన్ పాలనలో రాష్ట్ర భవిష్యత్ అంధకారమైందని, చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రానికి భవిష్యత్ అని చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం కవ్వగుంటలో సోమవారం జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి టీడీపీ ఆరు పథకాలను ప్రజలకు వివరించారు. తాతా సత్యనారాయణ, సుగసాని గంగాధరరావు, రాయల గణేష్, కొట్టు నరేష్, మోత్కూరి నాని, జనసేన నాయకులు పసుపులేటి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ ఆధ్వర్యంలో అంకాలంపాడులోని జలపావారిగూడెంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి సూపర్-6 పథకాలను వివరించారు. గరిమెళ్ళ దివాకర్, నిజాపురపు సత్యనారాయణ, మల్లెల్లి పృథ్వీరాజ్‌తోపాటు టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

### బీసీ సభ విజయవంతం

లింగపాలెం: మండలంలోని బోగోలులో జయహో బీసీ సదస్సు విజయవంతమైందని టీడీపీ మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు అన్నారు. బీసీ సెల్ మండల అధ్యక్షుడు తాళం సోంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు అండగా ఉండేది ఒక్క తెలుగుదేశం పార్టీ అన్నారు. మోరంపూడి మల్లికార్జునరావు, పిల్లల శ్రీనివాస్‌యాదవ్, తాతిన రాధాకృష్ణ, పాతూరి శ్రీనివాసరావు, అజయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ వలసలు

ఏలూరు టూటౌన్: వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలస వస్తున్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో 41, 42 డివిజన్లకు చెందిన బంగారు దుర్గారావు ఆధ్వర్యంలో వందలాది మంది సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బడేటి చంటి మాట్లాడుతూ వైసీపీ పాలనతో ప్రతీ ఒక్కరు విసుగు చెందారని, ప్రతీ ఒక్కరు టీడీపీ వైపు చూస్తున్నారన్నారు. ప్రజాకోర్టులో వైసీపీకి శిక్షపడే రోజు ఆసన్నమైందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి విజయం సాధించటం తధ్యమన్నారు. కార్యక్రమంలో త్రిపర్ణ రాజేష్, మల్లెపు రాము, బాలాజీ, ఆర్నేపల్లి మధు, లక్ష్మణరావు, చోడే వెంకటరత్నం, శివప్రసాద్, ఆర్నేపల్లి తిరుపతిరావు, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

## సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలించిన అధికారులు



వాహనాల్ని పరిశీలిస్తున్న అధికారులు

జీలుగుమిల్లి, జనవరి 29 : రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలను సోమవారం కమర్షియల్ టాక్స్ జేడీ డి.శ్రీలక్ష్మి పరిశీలించారు. ఎస్ఈబీ పోలీస్ అధికారులు సిబ్బందితో పాటు తమ శాఖకు సంబంధించిన సిబ్బంది ఇక్కడ విధులు నిర్వహిస్తారన్నారు. ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు చెక్‌పోస్టు ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే తాయిలాలు (బహుమతులు) నగదు రాకుండా పరిశీలిస్తారన్నారు. అసిస్టెంట్ కమిషనర్ బి.వినోద్‌కుమార్ సిబ్బంది వెంకటేశ్వరావు, షాను ఉన్నారు.

## కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లకు శిక్షణ



మాట్లాడుతున్న సబ్ రిజిస్ట్రార్ శ్యామ్‌నాగేశ్వరరావు

లింగపాలెం, జనవరి 29: పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లకు స్థలాల రిజిస్ట్రేషన్‌పై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.ఆశీర్వాదం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చింతలపూడి సబ్ రిజిస్ట్రార్ శ్యామ్ నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శులకు డిజిటల్ అసిస్టెంట్‌లకు స్థలాల రిజిస్ట్రేషన్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జేఎం.రత్నకుమార్, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## తెగుళ్ల నివారణపై రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న ఏవో

లింగపాలెం, జనవరి 29: మండలంలో మొక్కజొన్న, వరి పంటలను ఏవో కోటగిరి మురళీకృష్ణ సోమవారం పరిశీలించారు. తెగుళ్ల సోకకుండా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మొక్కజొన్నలో డ్రిప్ పద్ధతి ద్వారా నీటిని సరిపడా అందించవచ్చని, నీరు వృధాగా పోదన్నారు. రైతులు సమయానుకూలంగా పంటలు వేసుకోవాలని తెలిపారు. మండలంలో వరి 1500 ఎకరాల్లో, మొక్కజొన్న 4,500 ఎకరాల్లో, పొగాకు 750 ఎకరాల్లో సాగుచేసినట్లు ఆయన తెలిపారు.

## కొత్త పట్టిసీమ సర్పంచ్‌కు గ్రామస్తుల సత్కారం

పోలవరం, జనవరి 29: జాతీయ స్థాయిలో ఆరోగ్యవంతమైన పంచాయతీగా కొత్త పట్టిసీమ నిలిచింది. ఈ సందర్భంగా సర్పంచ్ మైగాపుల విజయదుర్గను సోమవారం గ్రామస్థులు సత్కరించారు. మైగాపుల దురాప్రసాద్ మాట్లాడుతూ కొత్త పట్టిసీమ గ్రామం నూతనంగా ఏర్పడిందని, సర్పంచ్ విజయదుర్గ గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారన్నారు. గ్రామాభివృద్ధి, పారిశుధ్యంలో జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చినందుకు గర్విస్తున్నామన్నారు. అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ ప్రమీలాదేవి మృతి



ఏలూరు రూరల్, జనవరి 29: చొదిమెళ్ళ మాజీ సర్పంచ్ తాళం ప్రమీలాదేవి (55)అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. చొదిమెళ్ళను ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దటంలో ఆమె విశేష కృషి చేశారు. మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి, రెడ్డి అప్పలనాయుడు తదితరులు ప్రమీలాదేవి మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాడ సానుభూతిని తెలియజేశారు.

## తక్కువ ధరకే ఇంటర్నెట్ సేవలు



ధరల టారిఫ్‌ను ప్రదర్శిస్తున్న ఓఎల్‌టీలు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 29: ఏపీ ఫైబర్‌నెట్ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో అతి తక్కువ ధరకే ఇంటర్నెట్ సేవలను అందజేస్తున్నట్టు మార్కెటింగ్ మేనేజర్ వై.రాజీవ్ తెలిపారు. రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి భవనంలో ఏపీ ఫైబర్‌నెట్ ఓఎల్‌టిల సమావేశాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. రాజీవ్ మాట్లాడుతూ ప్రతీ గ్రామానికి ఇంటర్నెట్ సేవలను తక్కువ ధరకు అందిస్తామన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీలో ఓఎల్‌టిలను ఏర్పాటు చేశామని, కేవలం రూ.190 కే ఇంటర్నెట్ సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంఎస్‌వో జి.బాలకృష్ణ, ఎ.వరప్రసాద్, భాస్కరరావు, ఓఎల్‌టిలు హాజరయ్యారు.

## ఇగ్నో ప్రవేశాలకు తుదిగడువు 31

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 29: ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో)లో బీఏ, బీకాం, డిప్లమో కోర్సులు, పీజీ సర్టిఫికెట్, డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు గడువును ఈ నెల 31వరకు పొడిగించారు. సీఆర్‌ఆర్ కళాశాల ప్రాంగణంలోని ఇగ్నో స్టడీసెంటర్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఇగ్నో వెబ్‌సైట్‌ద్వారా అడ్మిషన్లు పొందవచ్చునని, వివరాలకు స్టడీసెంటర్ 94003 50469 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## గాంధీ మండపాల వద్ద శాంతి ప్రదర్శనలు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 29: మహాత్మాగాంధీ 76వ వర్ధంతిని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గాంధీ మండపాల వద్ద శాంతి ప్రదర్శనలు, సర్వమత ప్రార్థనలు నిర్వహిస్తామని జిల్లా సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు సోమవారం తెలిపారు. పెదనింద్రకొలనులోని మహాత్మాగాంధీ భవనం వద్ద శాంతిసేన ర్యాలీ, చలో గాంధీభవనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. ప్రజా ప్రతినిధులు, సర్వోదయ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సంక్రాంతిక కానుక ఏదీ?

ఏలూరు టూటౌన్, జనవరి 29: సంక్రాంతి కానుకగా అవుట్‌సోర్సింగ్ కార్మికులకు విడుదల చేసిన వెయ్యి రూపాయలు ఇంకా ఇవ్వలేదని, తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు అప్పలరాజు డిమాండ్ చేశారు. కమిషనర్ వెంకటకృష్ణకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఇటీవల యూనియన్ నాయకులతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఒక్కొక్కరికి రూ.వెయ్యి ఇవ్వాలని జీఓ నెం.12 జారీ చేశారన్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు సంక్రాంతి కానుకను చెల్లించాలన్నారు. మున్సిపల్ పార్కుల్లో పని చేస్తున్న వాటర్ సప్లై సిబ్బందిని ఏఈలకు సెరండర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్ ఆస్పత్రిలో ఉచిత వైద్య పరీక్షలు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 29: ఏలూరు అశోక్‌నగర్‌లోని ఆయుష్ హాస్పిటల్స్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పరిసర ప్రాంతాల ప్రజలందరికీ ఈ నెల 31వరకు ఉచిత వైద్య పరీక్షలు చేయనున్నారు. సుగర్, బీపీ, బీఎంఐ, హెచ్‌బీ పరీక్షలను ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 1 గంటవరకు ఉచితంగా చేస్తున్నట్టు ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ సోమవారం తెలిపారు. వివరాలకు ఆస్పత్రి ఫోన్ నెంబర్లు 08812-227755, 84669 97333లలో సంప్రదించాలని కోరారు.

## జంతువులపై ప్రేమ కలిగి ఉండాలి

ఏలూరు టూటౌన్, జనవరి 29: జంతువులపై ప్రేమ కలిగి ఉండాలని పశుసంవర్ధక శాఖ డీడీ గోవిందరాజులు అన్నారు. సెంట్ మైఖెల్ ప్రైమరీ పాఠశాలలో జంతు సంక్షేమ పక్షోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. విద్యార్థులకు జంతువుల పై వ్యాసరచన, క్విజ్‌పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. మురళీకృష్ణ, ఏడీలు సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, కరస్పాండెంట్ జేసిప్ప, సిస్టర్ పద్మా, సిబ్బంది పాల్గొన్నారు.

## చిరంజీవికి అంబికా కృష్ణ అభినందనలు



చిరంజీవికి జ్ఞాపికను అందజేస్తున్న అంబిక కృష్ణ

ఏలూరు కల్చరల్, జనవరి 29: మెగాస్టార్ చిరంజీవి పద్మవిభూషణ్ పురస్కారం పొందడంతో అంబికా కృష్ణ అభినందించారు. నిర్మాత, అంబిక గ్రూపు సంస్థల చైర్మన్ అంబిక కృష్ణ హైదరాబాద్‌లో చిరంజీవిని కలసి జ్ఞాపికను అందజేశారు. గొప్ప నటుడిగా పేరుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలిచిన చిరంజీవికి అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ రావడం గొప్ప విషయమన్నారు.

## అభిమానుల హర్షం

చింతలపూడి, జనవరి 29: పట్టణంలోని శారదా మినీ థియేటర్ వద్ద మెగాస్టార్ చిరంజీవి అభిమానులు కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో థియేటర్ సిబ్బంది టి.ఎన్.వి.కుమార్, ఎస్.ఎ.రజాక్, ఆచారి, కె.నాగరాజు, శ్రీనివాసరావు, ఎ.జె.ఎస్.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అంబికేశ్వరస్వామికి అభిషేకాలు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 29: సత్రంపాడు అంబికాదేవి ఆలయ ప్రాంగణంలోని అంబికేశ్వరస్వామిని సోమవారం భక్తులు దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించి బిల్వార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ భక్తులతో ప్రత్యేక పూజలు, బిల్వార్చనలు జరిపించారు. అంబికా కుటుంబ సభ్యులు అంబికేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు రాఘవేంద్రశర్మ స్వామివారికి విశేష హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## నేడు ఏలూరులో ఫెడరల్ బ్యాంక్ ప్రారంభం

ఏలూరు రూరల్, జనవరి 29: నగరంలోని ఆర్‌ఆర్ పేటలో ఏర్పాటు చేసిన ఫెడరల్ బ్యాంక్‌ను మంగళవారం ప్రారంభించనున్నట్లు ఆ శాఖ మేనేజర్ ఎన్.శ్రీకాంత్ తెలిపారు. బ్రాంచితో పాటు ఏటీఎం, సేఫ్ డిపాజిట్ లాకర్ సేవలను ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. నాగ హనుమాన్ గ్రూప్ చైర్మన్ నూకల రామకృష్ణ ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

## జంగారెడ్డిగూడెం వెలమ సంక్షేమ సంఘం ఎన్నిక

జంగారెడ్డిగూడెం, జనవరి 29 : వెలమ సంక్షేమ సంఘం పట్టణ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. గాలి నూకరాజు అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా భీమిరెడ్డి జోగిబాబు, ఉపాధ్యక్షులుగా రొంగల దేవీప్రసాద్, ఈదుపల్లి అప్పారావు, బంగారు శ్రీనివాస్, కార్యదర్శిగా పైల చంటి, కోశాధికారిగా గొట్టాపు రామారావు, ఆర్గనైజర్‌గా చిటికెల రాంబాబు, సహాయ కార్యదర్శులుగా బేతా రమేష్, రాయపూడి శ్రీను, కొట్నాని అచ్యుతరావు, ప్రచార కార్యదర్శిగా నౌడు దుర్గారావు, 18 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. రాజాన సత్యనారాయణ(పండు), లోకవరపు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు ఎడ్యుకేషన్ :** కెరీర్ గైడెన్స్‌పై సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూలు పదో తరగతి విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు జరిగింది. కోర్సులు, అప్రంటీస్ విధానం, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు గురించి విజయభాస్కర్ వివరించారు.
- **ఏలూరు టూటౌన్ :** పేదల సంక్షేమం కోసం పాటుపడిన పల్నాటి సూర్యప్రకాశరావును ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారామ్ అన్నారు. పడమర వీధిలో సూర్యప్రకాశ్ సంస్మరణ సభ సోమవారం జరిగింది.
- **పెదపాడు :** కలపర్రు జడ్పీ హైస్కూల్‌లో ఫిట్ ఇండియా వారోత్సవాల్లో భాగంగా కలపర్రు హైస్కూల్ విద్యార్థులకు కబడ్డీ, వ్యాసరచన, యోగ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.
- **టి.నరసాపురం :** టి.నరసాపురం, బొర్రంపాలెం 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలో గల టి.నరసాపురం, గుర్వాయిగూడెం, బొర్రంపాలెంలో క్రాసింగ్ లైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు.
- **జంగారెడ్డిగూడెం :** బుట్టాయిగూడెం రోడ్డు పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి రూ.1.70కోట్ల నిధులతో బీటీ రోడ్డు పనులు విజయరాజు ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- **జంగారెడ్డిగూడెం :** పల్లెకు పోదాం కార్యక్రమానిరి మండల కన్వీనర్‌గా అడపాల రత్తయ్య, కో కన్వీనర్‌గా సూరంపూడి సుబ్బరాయ శర్మను నియమించినట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు.
- జంగారెడ్డిగూడెం పట్టణ, లక్కవరం పోలీస్‌స్టేషన్‌లకు సాధారణ బదిలీలపై వచ్చిన ఎస్‌ఐలు సోమవారం బాధ్యతలు చేపట్టారు. లక్కవరం ఎస్‌గా టి.సుధీర్, జంగారెడ్డిగూడెం ఎస్‌ఐగా జ్యోతిబసు బాధ్యతలు స్వీకరించారు.
- **లింగపాలెం :** బీజేపీ మండల అధ్యక్షుడు కుర్రా సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యంలో ముడిచర్ల గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమం ప్రారంభించారు. జి.మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు.
- **పోలవరం :** నియోజకవర్గంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో పోలవరం సచివాలయం 1 క్రికెట్ బృందం విజేతగా నిలిచింది.
- **భీమడోలు :** కోడి వ్యర్థాలను తరలిస్తున్న వ్యాన్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. కురెళ్ళగూడెం సమీపంలో వ్యాన్ పటుబడిందన్నారు. ఉంగుటూరు మండలం గ్రామానికి చెందిన వనమాలరామకృష్ణ, సైదు నాగబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



నల్లచీరలు ధరించి నిరసన తెలియజేస్తున్న సెర్ప్ సిబ్బంది



ఆర్టీసీ గ్యారేజ్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

# నోటికి నల్ల రిబ్బన్‌తో సెర్ప్ ఉద్యోగుల నిరసన

ఏలూరు కలెక్టరేట్, జనవరి 29: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెర్ప్ ఉద్యోగుల చేపట్టిన సమ్మె సోమవారం ఆరో రోజుకు చేరింది. మహిళలు నల్లచీరలు, పురుషులు నల్ల చొక్కాలు ధరించి నోటికి నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన తెలియజేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో కీలకపాత్ర పోషిస్తున్నామన్నారు. సెర్ప్ ఉద్యోగులు అందరినీ రెగ్యులర్ చేయాలని, తెలంగాణ మాదిరిగా పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు తక్షణం పరిష్కరించాలన్నారు.

### విశాఖలో ఆర్టీసీ కార్మికుల అరెస్ట్‌పై నిరసన

విశాఖలో ఆర్టీసీ యాజమాన్య కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ నిరవధిక నిరాహార దీక్ష శిబిరాన్ని పోలీసులు బలవంతంగా తొలగించి అరెస్ట్ చేయడాన్ని కార్మికులు ఖండించారు. ఏలూరు ఆర్టీసీ డిపో గ్యారేజ్ వద్ద ఎన్ఎంయూఏ నాయకులు సోమవారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు. డిపో అధ్యక్ష, కార్యదర్శులు పీవీఎస్ఎస్.ప్రసాద్, పువ్వుల శ్రీనివాసరావు, డిపో ఉపాధ్యక్షుడు కె.ఆర్.కె రావ్ మాట్లాడుతూ విశాఖలో ఆర్టీసీ యాజమాన్యం నిరంకుశ చర్యలకు పాల్పడుతుందన్నారు. విశాఖ ఆర్టీసీ యాజమాన్యం తీరును వ్యతిరేకిస్తూ రెండురోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. బస్సు డ్రైవర్లపై కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జోనల్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.ప్రసాదరావు, ఎన్ఎంయూఏ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నిధి లేదు.. కాగితాలే!



ఆగిరిపల్లి, జనవరి 29: రెండు నెలల క్రితం ఆగిరిపల్లిలో ఇంటిని కూల్చివేస్తుండగా ఒక ఇనుప పెట్టె బయటపడింది. అందులో నిధి నిక్షేపాలు ఉండవచ్చన్న అపోహతో స్థానికులు అధికారులకు తెలపగా అధికారులు దానిని స్వాధీనం చేసుకుని భద్రపరిచారు. ఆగిరిపల్లికి చెందిన దేవులపల్లి శ్రీరామమూర్తికి చెందిన ఇంటిని ఎండూరి శివరాం, పార్థసారథి అనే వారికి గతంలో విక్రయించారు. ప్రస్తుతం శ్రీరామమూర్తి వారసులు అమెరికాలో నివాసం ఉంటున్నారు. అయితే ఇంటిని కొనుగోలు చేసిన వారు పాత భవనాన్ని కూల్చి వేస్తుండగా అందులో ఉన్న ఇనుప పెట్టె బయటపడడం ఆగిరి పల్లిలో కలకలం రేపింది. అయితే ఆ ఇనుప పెట్టె తాళం వేసి ఉండటం ఆ తాళం అమెరికాలో ఉన్న ఇంటిని విక్రయించిన యజమానుల వద్ద ఉండడంతో ఇప్పటి వరకు దానిని తెరవలేదు. ఇటీవల అమెరికా నంచి వచ్చిన యజమానులు ఆ తాళాన్ని స్థానిక ఎమ్మార్వో ఉదయభాస్కర్‌కు ఇవ్వగా అది తెరుచుకోక పోవడంతో వెల్డర్లు కష్టపడి పెట్టె బద్దలు చేశారు. అయితే అందులో కేవలం డాక్యుమెంట్స్, సత్యసాయిబాబా ఇంటి యజమాని దేవులపల్లి శ్రీరామ్మూర్తికి రాసిన ఉత్తరాలు, కొన్ని ఫొటోలు బయటపడ్డాయి. అందులో ఏమీ ఉండవని యజమానులు మొత్తుకుంటున్నా స్థానికుల కోరిక మేరకు ప్రజల సమక్షంలో బద్దలు కొట్టవలసి వచ్చింది. ఏమైనా నిధి నిక్షేపాలు ఉంటాయని ఆత్రుతతో ఎదురుచూసిన స్థానికులకు అందులో ఏమీ లేకపోవడంతో నిరాశ ఎదురైంది.

## వంతెనపై రక్షణ ఏర్పాట్లు..



ముదినేపల్లి, జనవరి 29 : ముదినేపల్లి నడిబొడ్డున ప్రవహించే పోల్ రాజ్ కెనాల్‌పై నిర్మించిన పక్కా కాలిబాట వంతెన వద్ద పంచాయతీ అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. "రక్షణ ఏదీ" శీర్షికన ఇటీవల ఈ వంతెన వద్ద ప్రమాద స్థితిపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన పంచాయతీ పాలక వర్గం, అధికారులు ఈ వంతెన ఎక్కేందుకు సిమెంట్ ర్యాంప్, వంతెనపై రెయిలింగ్స్ ఏర్పాటు పనులు చేపట్టారు. సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, ఉప సర్పంచ్ ఈడే సుధాకర్, సభ్యులు ఈ వంతెనపై వెళ్లేందుకు ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి రూ.2 లక్షల పంచాయతీ నిధులతో రక్షణ పనులు నిర్వహిస్తున్నారు.




## 24 గంటల్లోపే స్పందించారు..

ఆగిరిపల్లి, జనవరి 29: చేతికి అందే ప్రమాదం శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ యంత్రాంగం స్పందించింది. సోమవారం లైన్‌మన్ శోభన్‌బాబు ఫ్యూజు బాక్సును ఎత్తుగా అమర్చారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## మత్స్యకారుడి మృతి కారకులను శిక్షించాలి

కలిదిండి, జనవరి 29 : పల్నాడు జిల్లాలో మత్స్యకారుడు దుర్గారావు మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మట్టగుంటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసుల వేధింపుల వల్లే మత్స్యకారుడు బలవన్మరణం చెందాడన్నారు. దుర్గారావు మృతికి కారకులైన వారిని సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించి శిక్షించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. డీసీ వైస్ చైర్మన్ నాగిడి వీరబ్రహ్మం, మత్స్యకార సంక్షేమ సంఘం నాయకులు తిరుమాని పాండురంగారావు, మోకా వెంకట రమణ, పరశురాముడు, నాగిడి నారాయణమూర్తి పాల్గొన్నారు.

## పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఎస్ఐ

కైకలూరు, జనవరి 29: రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని కైకలూరు రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఎస్సై తలారి రామకృష్ణ పరిశీలించారు. సోమవారం ఆయా గ్రామాల్లో పర్యటించి పోలింగ్ బూత్ వివరాలను తెలుసుకొని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తామన్నారు.

## మాజీ ఎమ్మెల్యే కమ్మిలి అప్పారావుకు ఘన నివాళి



కైకలూరు, జనవరి 29: కైకలూరు మాజీ ఎమ్మెల్యే కమ్మిలి అప్పారావు వర్థంతి సందర్భంగా సోమవారం కైకలూరులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కమ్మిలి అప్పారావు కోడలు స్వర్ణకుమారి పేదలకు భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ అన్నం రాంబాబు, జనసేన నాయకులు మైగాపుల రామాంజనేయులు, రామస్వామి, వార్డు మాజీ సభ్యులు అమీర్, టీడీపీ నాయకురాలు శీలం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



కోరుకొల్లులో ఎండుతున్న మినుము పంట

## సాగు నీరివ్వరూ..

» ఎండుతున్న మినుము పైరు

కలిదిండి, జనవరి 29 : నీరందక మినుము పైరు ఎండిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పూత దశలో ఉంది. ఈ తరుణంలో పైరుకు తడి పెట్టాల్సి ఉంది. సీబీ కెనాల్, పంట కాల్వల్లో సాగునీరు అడుగంటింది. ఇంకా మూడు రోజుల్లో మినుము పైరుకు నీరు పెట్టకపోతే పైరు వడిలి పూత రాలిపోతుంది. మండలంలో సుమారు 5 వేల ఎకరాల్లో మినుము సాగు చేస్తున్నారు. కోరుకొల్లు, సానారుద్రవరం, గోపాలపురం, వెంకటాపురం గ్రామాల్లో పంట ఎండి పూత రాలిపోతోంది. కాల్వలకు సాగునీరు విడుదల చేయాలని పాలకులు, అధికారులకు పలు మార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సాగునీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.



పోలవరం-మర్లపాలెం మధ్య రహదారి అంచున అగాథం



అగాథం పక్కనే ప్రతిష్ఠోత్సవాలకు సిద్ధమవుతున్న శివాలయం

# తక్షణం స్పందించకుంటే ముప్పే!

» మిచౌంగ్ వరదకు రహదారి పక్కనే ఏర్పడిన అగాథం

» సమీపాన ఉన్న శివాలయంలో త్వరలో ప్రతిష్ఠాపనోత్సవాలు

» వాహనాలు ఎదురెదురుగా వస్తే అగాథంలోకే..

చాట్రాయి, జనవరి 29: మండలంలో పోలవరం- మర్లపాలెం గ్రామాల మధ్య ఉప్పు వాగు వద్ద రహదారి అంచునే ఉన్న పెద్ద గొయ్యి ప్రమాదకరంగా ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మిచౌంగ్ తుఫాన్ వరదకు సుమారు 20 మీటర్లు పొడవు, 15 అడుగుల లోతు, 20 అడుగుల వెడల్పున అగాథంలా ఏర్పడింది. ఇక్కడే నూతనంగా శివాలయం నిర్మించి, త్వరలో ప్రతిష్ఠామహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమానికి వేలాదిగా భక్తులు ఇక్కడకు వస్తారు. రాత్రి సమయంలో ఏదైనా వాహనం ఎదురువచ్చి రోడ్డు పక్కకు దిగితే అంతే సంగతులు అగాథంలో పడిపోయే ప్రమాదం ఉంది. ఇక్కడ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అగాథాన్ని వెంటనే పూడ్చించాలని ప్రజలు కోరుతున్నారు.




మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గాభవాని

## సమస్యల పరిష్కారంలో..
# అధికారుల నిర్లక్ష్యం

» మండల సమావేశంలో ప్రజాప్రతినిధుల ధ్వజం

» ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని వెల్లడి

ముసునూరు, జనవరి 29: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రజాప్రతినిధులు చెప్పినా పట్టించుకోవడం లేదని ఎంపీపీ కొండా దుర్గాభవాని వెంకట్రావ్, జడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ప్రతాప్ అసహనం వ్యక్తం చేశారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకాకపోతే సమస్యలపై ఎలా సమీక్షించాలని ఎంపీపీ ప్రశ్నించారు. జడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమస్యలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోవడం లేదని, ప్రజా సమస్యలపై స్పందించని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. వైస్ ఎంపీపీ కోటగిరి రాజా, పీఏసీఎస్ అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరావు మాట్లాడుతూ అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకోవాలని, జలజీవన్ మిషన్ నిధులతో గ్రామాల్లో మంచినీటి ట్యాంక్‌ల నిర్మాణానికి వెంటనే భూసేకరణ చేయాలని సూచించారు. నూతన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల ప్రక్రియను వేగవంతం చేయాలని, పలు గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించాలని ట్రాన్స్‌కో ఏఈ హేమసుందర్‌రావుకు సూచించారు. రమణక్కపేట అటవీ భూముల్లో రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల జాయింట్ సర్వేను పూర్తిచేసి అర్హులైన పేదలకు పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అధికారులు తమ శాఖల పనితీరును వివరించారు. వైస్ ఎంపీపీ-2 పాముల గంగాధర రావు, ఎంపీడీవో జి.రాణి, డిప్యూటీ తహసీల్దార్ ఎమిలికుమారి, సూపరింటెండెంట్ కె.సాయిరాము తదితరులు పాల్గొన్నారు.



రాచపట్నం సమావేశంలో మాట్లాడుతున్న కామినేని శ్రీనివాస్

## వైసీపీని సాగనంపకుంటే రాష్ట్రం అధోగతే

కైకలూరు, జనవరి 29: వైసీపీ అరాచకాలు పెరిగిపోయాయని వాటికి స్వస్తి పలకకపోతే రానున్న రోజుల్లో రాష్ట్రం అధోగతిపాలవుతుందని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాచపట్నం, సీతనపల్లి గ్రామాల్లో జరిగిన ఆత్మీయ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ జగన్ లిక్కరు, ఇసుక మాఫియాతో లక్షల కోట్లు పక్కదారి పట్టించాడన్నారు. అన్ని వస్తువులు, విద్యుత్ చార్జీలను పెంచి పేద, బడుగు, బలహీనవర్గాలను దెబ్బతీశారన్నారు. తన కేసుల నుంచి బయటపడడానికి మరలా అడ్డదారిలో సీఎం కావడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. కైకలూరు నియోజకవర్గంలో అభివృద్ధి లేదని, అభివృద్ధిపై ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేసి వారి సెల్‌ఫోన్లను తీసుకుని నియంత పాలన సృష్టిస్తున్నారన్నారు. సీతనపల్లి గ్రామంలో ఈనాం భూములకు పట్టాదారు పుస్తకాలు లేక ఇబ్బందులకు గురైన 300 మంది రైతులకు గత ప్రభుత్వ హయాంలో పట్టాలు అందజేసిన ఘనత తనదేనన్నారు. గ్రామంలో రూ.5 కోట్ల 30లక్షల నిధులతో అభివృద్ధి చేశానన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు బలే ఏసురాజు, పూల రామచంద్రరావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు విజయలక్ష్మి, తెంటు వెంకటరమణ, గం గుల శ్రీదేవి, జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మీ, ఆయా గ్రామ పార్టీల నాయకులు గొరిపర్తి నాగేంద్ర, బోడావుల ఎలిషారాజు, మాడెం కృష్ణారా వు, నాగనబోయిన రాఘవ, వీరగాని కనకదుర్గారావు, బూసనబోయిన శ్రీనివాసు, వీరగాని సుబ్బారావు, కట్టా కనక దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

## జయహో బీసీ సభ విజయంతం చేయండి

కైకలూరు, జనవరి 29: ఆటపాకలో ఈ నెల 31న జరిగే జయహో బీసీ సభను విజయవంతం చేయాలని జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బొమ్మనబోయిన విజయలక్ష్మి కోరారు. సోమవారం కైకలూరు టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకుడు పెన్మెత్స వెంకటేశ్వరరాజు, మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బుధవారం ఆటపాకలోని కస్తూరిప్లాజా ఎదురుగా ఉన్న మైదానంలో మధ్యాహ్నం 3 గంటలకు జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నామని కైకలూరు నియోజకవర్గంలోని బీసీలు, టీడీపీ నేతలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. గ్రామాల్లో తమపై జరుగుతున్న దాడులు, ఇబ్బందులను బీసీలు సమావేశం దృష్టికి తేవాలన్నారు. సమావేశానికి రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా పాల్గొంటారని బీసీలంతా పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. బీసీ నాయకులు వీరమల్లు నరసింహారావు, బలే ఏసురాజు, పూల రామచంద్రరావు, నారగాని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలి

కలిదిండి, జనవరి 29 : ఈవీఎంలపై ఓటర్లు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ దశిక వంశీ అన్నారు. సోమవారం కలిదిండిలో ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడుతూ కొత్తగా ఓటు హక్కు కలిగిన ఓటర్లకు ఈవీఎంలపై బటన్‌లు ఏ విధంగా నొక్కాలి, వాటిపై ఉండే ఎన్నికల గుర్తులను వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.





లోకుమూడి, పెదలంక దళితవాడలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

# దళితులను విస్మరించిన వైసీపీ

కలిదిండి, జనవరి 29 : వైసీపీ ప్రభుత్వం దళితులను విస్మరించిందని మహాసేన జిల్లా అధ్యక్షుడు చాబత్తిన రాజు విమర్శించారు. సోమవారం పెదలంక దళితవాడలో టీడీపీ నాయకులతో కలసి బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కర పత్రాలు పంపిణీ చేసి మ్యానిఫెస్టోలో పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బడుగు, బలహీనవర్గాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించటంతో దళిత వాడల్లో అంతర్గత రహదారుల అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. దళితులను వైసీపీ ఓటు బ్యాంక్‌గా ఉపయోగించుకుని వదిలేసిందన్నారు. బలహీనవర్గాల అభ్యున్నతే టీడీపీ ధ్యేయమని, టీడీపీ గెలుపుకు దళితులంతా ఐక్యంగా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బళ్ల రాజు, ఉప సర్పంచ్ చాయదేవి, నాయకులు చాబత్తిన శ్రీనివాసరావు, దావీదు, శేఖర్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

» భవిష్యత్‌కు గ్యారెంటీలో నాయకుల ధ్వజం

**మండవల్లి:** మండవల్లి మండలం లోకుమూడిలో టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు నారగాని వీర వెంకట నాగేశ్వరరావు, క్లస్టర్ కూనపురెడ్డి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి కుటుంబానికి వర్తించే సంక్షేమ పథకాలు బాబుష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ హామీ పత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు పెన్మెత్స వెంకటేశ్వరరాజు(వెంకట్, కలిదిండి), ముదినేపల్లి మండల ప్రజాపరిషత్ మాజీ అధ్యక్షులు వీరమల్లు నరసింహారావు, రాష్ట్ర టీడీపీ యాదవ సాధికారిక కార్యదర్శి తలారీ రాజేష్, తెలుగుదేశంపార్టీ నాయకులు వీరాబత్తిన సుధా, నియోజకవర్గ టీడీపీ బి.సి సెల్ కార్యదర్శి మారగాని మురళీకృష్ణ, బూత్ కన్వీనర్ గడిదేశి విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి హుండీల ఆదాయం రూ. 3.34 కోట్లు

ద్వారకాతిరుమల, జనవరి 29: ద్వారకాతిరుమలవాసునికి హుండీల లెక్కింపు ద్వారా 32 రోజుల కాలానికి రూ.3.34 కోట్లు భారీ ఆదాయం సమకూరింది. స్థానిక ప్రమోద కల్యాణ మండప ఆవరణలో సోమవారం అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీల లెక్కింపును నిర్వహించారు. హుండీల ద్వారా లభించిన రూ. 3,34,81,330 నగదుతో పాటు, 418 గ్రాముల బంగారం, 14.660 కేజీల వెండి లభించినట్లు ఈఓ వి. త్రినాథరావు తెలిపారు. అలాగే రద్దయిన పాతనోట్లు రూ.500 (17), 1000(1), 2000(114) తో పాటుగా విదేశీ కరెన్సీ సైతం అధికంగా లభించింది.

## వెలుగు కార్యాలయంలో పనులు బంద్

ముదినేపల్లి, జనవరి 29 : ఇందిరా క్రాంతి పథం ఉద్యోగుల సమ్మె సోమవారం నాటికి ఆరవ రోజుకి చేరింది. ఈ శాఖ అధికారులు, సిబ్బంది కొందరు నిరవధిక సమ్మెలో పాల్గొనటంతో వెలుగు కార్యాలయ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. ముదినేపల్లి మండలంలో ఏపీఎంతోపాటు, ముగ్గురు సీసీలు సమ్మె చేస్తున్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులమైన తమను రెగ్యులర్ చేయాలని, రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, గ్రాట్యుటీ వర్తింపచేయాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ ఉద్యోగులు ఈ నెల 24 నుంచి సమ్మె చేస్తున్నారు. కార్యాలయ అధికారి (ఏపీఎం) కూడా సమ్మెలో ఉండటంతో పలు పనులు నిలిచిపోయాయి. స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన ఫైల్స్‌పై అధికారులు సంతకాలు చేసే అవకాశం లేకుండాపోయింది. సంఘాలపై సీసీల పర్యవేక్షణ కొరవడింది.

## ఒంపుల కొబ్బరి



ముదినేపల్లి, జనవరి 29 : ఒంపులతో పెరిగిన ముదినేపల్లిలోని ఓ కొబ్బరి చెట్టు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. స్థానిక సహాయ మాతా స్కూలు సమీపాన వంకర తిరిగి ఉన్న ఈ చెట్టు సుమారు 40 ఏళ్లగా తుపానులు, ఈదురు గాలులను సైతం తట్టుకుని కూలిపోకుండా ఉండటం విశేషం. మొదలు నుంచి సుమారు 20 అడుగులు నిటారుగా పెరిగి ఒక వైపునకు ఆరు అడుగులు అడ్డంగా వెళ్లి అక్కడి నుంచి మరో వంకర తిరిగి పది అడుగుల మేర పెరిగి ఆకులు, కాయలతో ఈ చెట్టు ఉండడం విశేషం. మరో విశేషమేమిటంటే ఆ చెట్టు అక్కడ సహజ సిద్ధంగా పెరిగింది.



## రూరల్ ఎస్సైగా మల్లికార్జున్‌రెడ్డి



నూజివీడు టౌన్, జనవరి 29: నూజివీడు రూరల్ ఎస్సైగా ఆర్.మల్లికార్జున్‌రెడ్డి సోమవారం బాధ్యతలను స్వీకరించారు. జంగారెడ్డిగూడెం ఎస్సైగా పనిచేస్తున్న ఆయనను సాధారణ బదిలీల్లో భాగంగా నూజివీడుకు బదిలీ చేయగా, నూజివీడు రూరల్ ఎస్సైగా పనిచేస్తున్న టి.రామకృష్ణను కైకలూరుకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో మల్లికార్జున్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నూజివీడు రూరల్ సీఐ బాలసురేష్, డీఎస్పీ ఇ.అశోక్‌కుమార్‌గౌడ్‌లను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

## స్పందనకు 8 దరఖాస్తులు

నూజివీడు, జనవరి 29:నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 8 అర్జీలు దాఖలైనట్టు సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో టి.తేజామణి తెలిపారు. అర్జీల్లో దాదాపు సగం రెవెన్యూ, సర్వే విభాగాలకు సంబంధించినవేనని తెలిపారు. చాట్రాయి మండలం బూరగ్గూడెంకు చెందిన దేవరకొండ సోమయ్య, గోలి మల్లమ్మ, గడ్డం సాయిరామ్‌కృష్ణారెడ్డి, నూజివీడు మండలం బోర్వంచకు చెందిన బొబ్బా కిరణ్‌కుమార్, బొబ్బా సత్యనారాయణ తమ భూములను రికార్డు ప్రకారం కొలిచి అప్పగించాల్సిందిగా కోరుతూ సబ్ కలెక్టర్‌కు అర్జీలు దాఖలు చేశారు.

## గోశాలకు విరాళం



ఆగిరిపల్లి, జనవరి 29: గోసేవ కోసం విరాళం ఇవ్వడం అభినందనీయమని ఆగిరిపల్లి వేద పాఠశాల కార్యదర్శి సూరిశర్మ అన్నారు. విజయవాడకు చెందిన దేవులపల్లి సత్యనారాయణ మూర్తి ఆగిరిపల్లి వేద పాఠశాలలో ఉన్న గోశాలకు పశుపోషణార్థం రూ.30 వేలు విరాళంగా అందజేయగా కార్యదర్శి శర్మ దాత సత్యనారాయణమూర్తిని సత్కరించి అభినందించారు.

## కాపులు పెద్దన్నపాత్ర పోషించాలి



నూజివీడు టౌన్, జనవరి 29: నూజివీడు మండలం పాతరావిచర్ల గ్రామంలో జనసేనపార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా అధికారప్రతినిధి మరీదు శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జనసేన పార్టీ జెండా దిమ్మెను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ అమ్మిశెట్టి వాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా నూజివీడులో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ అధినేత పవన్‌కల్యాణ్ చెప్పినట్టుగా కాపులు పెద్దన్నపాత్ర పోషించిన రోజు పార్టీ బలోపేతం అవుతుందన్నారు. నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే టీడీపీ, జనసేన అధికారంలోకి రావాలన్నారు. కృష్ణా, పెన్నా రీజియన్ జనసేన కో-ఆర్డినేటర్లు పార్వతినాయుడు, రావి సౌజన్య, రావిచర్ల ఎంపీటీసీ మరీదు శివనాగమణి, టీడీపీ, జనసేన నాయకులు ముసునూరు రాజా, యర్రంశెట్టి రాము, ఆరేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## తెలుగు యువత క్యాలెండర్ ఆవిష్కరణ

నూజివీడు టౌన్, జనవరి 29: యువతకు ఉద్యోగ అవకాశాలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అసమర్థ నిర్ణయాలను ప్రజలకు తెలిపి తెలుగుదేశాన్ని అధికారంలోకి తీసుకువచ్చేలా కృషి చేయాలని నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నూజివీడు మండల తెలుగుయువత అధ్యక్షుడు పిన్నమనేని అలోక్‌నాథ్ ఆధ్వర్యంలో రూపొందించిన తెలుగు యువత క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. నూజివీడు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు చలసాని గోపాలకృష్ణ, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## చాట్రాయి క్రీడాకారుల ప్రతిభ

చాట్రాయి, జనవరి 29: నూజివీడులో జరిగిన ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో చాట్రాయి మండల జట్లు ప్రతిభను చూపాయని ఎంపీడీవో దుర్గాప్రసాద్ తెలిపారు. బాలికల విభాగంలో ఖోఖో, కబడ్డీలో ప్రథమ, వాలీబాల్‌లో మూడో స్థానం సాధించినట్లు చెప్పారు. పురుషుల విభాగంలో బ్యాడ్మింటన్‌లో ప్రథమ, వాలీబాల్‌లో మూడో స్థానం సాధించినట్లు వివరించారు. విజేతలను పీఈటీలు సతీష్‌కుమార్, ప్రభాకరరావు, విజయ్, వెంకట్ ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు అభినందించారు.

## ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం

నూజివీడు టౌన్, జనవరి 29: నూజివీడు కోదండరామాలయంలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత నృత్య దర్శకులు కళా విశారద, కె.వి సత్యనారాయణ, దండమూడి సుమతి రామ్మోహన్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరై కోదండరాముడి గీతాల ఆడియోను ఆవిష్కరించారు. శ్రీ సత్య నృత్య సంగీత కళాకారులు, ప్రిన్సిపాల్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### క్రైం కార్నర్

## గంజాయి రవాణా కేసులో నలుగురి అరెస్ట్



నూజివీడు, జనవరి 29: గంజాయిని రవాణా కేసులో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని 3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు నూజివీడు డీఎస్పీ ఇ. అశోక్‌కుమార్‌గౌడ్ తెలిపారు. నూజివీడు రూరల్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముసునూరు మండలం కాట్రేనిపాడులో వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో ఏలూరు వైపు నుంచి వస్తున్న ఆటో పోలీసులను చూసి వెనుతిరిగి వెళ్ళటంతో ఆటోని అందులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి లభ్యమైందన్నారు. నూజివీడు అమ్మవారితోటకు చెందిన షేక్ సిద్ధిక్ హుస్సేన్, పాతపేటకు చెందిన పటాన్ అస్లామ్‌ఖాన్, వెలంపేటకు చెందిన దేవరకొండ ప్రతాప్‌లతో పాటు మరో మైనర్ నలుగురు కలసి మారేడుమిల్లి సమీపంలోని గుడిసె గ్రామం నుంచి గంజాయిని తీసుకువస్తున్నారని, నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి మూడు కేజీల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్‌లు, ఒక ఆటోను స్వాధీనపరుచుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నూజివీడు రూరల్ సీఐ పి.బాలసురేష్‌బాబు, ముసునూరు ఎస్సై పి.వాసులను డీఎస్పీ అభినందించారు.

## స్థలం విషయమై కొట్లాట

ముదినేపల్లి, జనవరి 29 : స్థల వివాదం బావా, బావమరుదుల మధ్య కొట్లాటకు దారి తీసిన సంఘటన ముదినేపల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ముదినేపల్లి ఆర్టీసీ బస్ స్టేషన్ పక్కనే ఉన్న ఇంటి స్థలంపై ఐదేళ్ల నుంచి పరసా శ్రీనివాసరావు, పోలగాని నాగరాజు మధ్య వివా దం కొనసాగుతూనే ఉంది. పెద్దలు చేసిన రాజీ ప్రయత్నాలు ఫలించలేదు. దీనిపై తరచూ తగాదాలు జరుగుతున్నాయి. నాగరాజు స్థలం మొత్తం తనదేనని, తన బావ శ్రీనివాసరావుకు సంబంధం లేదని చెబుతున్న నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇరువురి మధ్య వివాదం ముదిరి దాడికి దిగారు. ఇద్దరూ గాయాలకు గురయ్యారు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్ఐ వెంకట్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

## 10 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి, జనవరి 29: చాట్రాయి మండలం పర్వతాపురం చెక్‌పోస్ట్ వద్ద సోమవారం 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు చాట్రాయి ఎస్సై స్వామి తెలిపారు. సారా రవాణాచేస్తున్న నిందితుడు బాణావతు భీముడుని అదుపులోకి తీసుకుని అతని వాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు.